విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



సంపుటి : 3 | సంచిక : 277 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శుక్రవారం 27 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

## 2027 గోదావరి పుష్కరాలు

### మహా కుంభమేళా తరహాలో నిర్వహణకు ఏపీ సర్కార్ నిర్ణయం



- 2027 గోదావరి పుష్కరాలపై ఏపీ కేబినెట్ సబ్ కమిటీ సమావేశం
- మహా కుంభమేళా స్థాయిలో పుష్కరాలు నిర్వహించాలని నిర్ణయం
- సుమారు 8 నుంచి 10 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా
- 6 జిల్లాల్లో మొత్తం 369 స్నానఘట్టాల ఏర్పాటుకు ప్రణాళిక

2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను మహా కుంభమేళా స్థాయిలో అత్యంత వైభవంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పుష్కరాలకు సుమారు 8 నుంచి 10 కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తోంది. దేవాదాయ

- మిగతా2లో



# ఘటనలు జరిగాక స్పందిస్తే ప్రయోజనం లేదు

- శ్రీకాకుళం, రాజమండ్రి ఘటనలపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి
- ముందస్తు నివారణే ముఖ్యమని స్పష్టీకరణ
- క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేసి యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని కలెక్టర్లకు సూచన
- బాధితులకు అందుతున్న వైద్య సాయం, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆరా తీసిన సీఎం

### అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

శ్రీకాకుళం పట్టణంలో కలుషిత తాగునీటి కారణంగా డయేరియా ప్రబలడం, రాజమండ్రిలో కల్తీ పాల వల్ల పలువురు ప్రాణాలు కోల్పోవడం వంటి తీవ్రమైన ఘటనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మున్సిపల్, వైద్యారోగ్య శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ రెండు విషాద ఘటనల్లో ప్రజల ప్రాణాలు పోవడానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏమాత్రం ఉపేక్షించవద్దని అధికారులను తీవ్రంగా హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం కావాలని స్పష్టం చేశారు.

**ముందస్తు చర్యలే ముఖ్యం: సీఎం చంద్రబాబు**

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ఘటన జరిగాక స్పందించడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదు. ముందస్తు పర్యవేక్షణ, అప్రమత్తత ద్వారా ఈ తరహా ఘటనలు జరగకుండా చూడాలి. శ్రీకాకుళంలో

- మిగతా2లో



### త్వరలో గ్రేడ్ ఆధారిత డ్రైవింగ్ లైసెన్సులు

- పాయింట్లు తగ్గితే సస్పెన్షన్, రద్దు
- కేంద్ర మంత్రి గడ్కరీ వెల్లడి

దిల్లీ: బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌ను ప్రోత్సహించడానికి, రోడ్డు ప్రమాదాలను నివారించడానికి గ్రేడ్ ఆధారిత డ్రైవింగ్ లైసెన్సుల వ్యవస్థను ప్రవేశపెట్టాలని భావిస్తున్నామని రోడ్డు రవాణా, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. రోడ్డు భద్రతపై భారతీయ

- మిగతా2లో



### విమాన టికెట్ తీసుకున్న 48 గంటల్లో మార్పులు ఉచితం

#### రద్దు చేసుకున్నా అదనపు రుసుములు ఉండవు: డీజీసీఏ

దిల్లీ: విమాన టికెట్లు తీసుకున్నవారు 48 గంటల్లోగా దానిని రద్దు చేసుకున్నా, కొన్ని మార్పులు చేసుకున్నా అదనపు రుసుములు లేకుండా విమానయాన సంస్థలు అనుమతించేలా 'పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్' (డీజీసీఏ) వెసులుబాటు కల్పించనుంది. కొన్ని షరతులకు లోబడి


- మిగతా2లో

### మద్యం కుంభకోణం నిందితుడు ముప్పిడి అవినాష్‌రెడ్డి అరెస్ట్

- లంచాల నెట్‌వర్క్ నిర్వహణ, మనీ లాండరింగ్‌లో కీలక పాత్ర
- ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డికి తోడల్లుడు
- గతేడాది సిట్ ఏర్పాటైన మరుక్షణమే థాయ్‌లాండ్‌కు పరారు
- సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎట్టకేలకు సిట్ విచారణకు హాజరు
- శుక్రవారం వరకూ రిమాండ్
- గుంటూరు జిల్లా జైలుకు తరలింపు

- మిగతా2లో





### వైభవంగా... ఆహ్లాదకరంగా విరోష్ వివాహం

- నటి రష్మిక మందన్నను వివాహం చేసుకున్న స్టార్ హీరో విజయ్ దేవరకొండ
- పెళ్లి తర్వాత సోషల్ మీడియాలో భావోద్వేగపూరిత పోస్ట్ షేర్ చేసిన విజయ్
- నా బెస్ట్ ఫ్రెండ్‌నే నా భార్యగా చేసుకున్నానంటూ వెల్లడి
- ఉదయ్‌పూర్‌లో అత్యంత సన్నిహితుల మధ్య ఘనంగా జరిగిన వివాహ వేడుక
- అభిమానులు పెట్టిన 'విరోష్' పేరునే తమ పెళ్లికి ఖరారు చేసుకున్న జంట

- మిగతా2లో

# ఇజ్రాయెల్‌తో వాణిజ్య ఒప్పందం

- ద్వైపాక్షికంలో సరికొత్త శకం
- 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి భారత్, ఇజ్రాయెల్ బంధం
- నెతన్యాహుతో ప్రధాని మోదీ భేటీ
- త్వరలోనే ఎఫ్‌టీఏ కుదుర్చుకోవాలని నిర్ణయం
- 17 ఒప్పందాలపై సంతకాలు
- భారత పర్యటనకు రావాలని ఇజ్రాయెల్ అధ్యక్షుడు హెర్జోగ్‌కు మోదీ ఆహ్వానం



జెరూసలెం: భారత్-ఇజ్రాయెల్ సంబంధాల్లో సరికొత్త శకం మొదలైంది. ఎన్నో కాల పరీక్షలకు నిలిచిన తమ బంధాన్ని ఇరు దేశాలు తాజాగా 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచుకున్నాయి. ఉభయ ప్రయోజనకర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టీఏ) త్వరలోనే కుదుర్చుకోవాలనీ నిర్ణయించుకున్నాయి. ఇజ్రాయెల్ పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుతో భారత ప్రధాని మోదీ గురువారం భేటీ అయ్యారు. ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా చర్చలు జరిపారు.

- మిగతా2లో




### కర్నూలు, నరసరావుపేట కూటమి నేతలకు మంత్రి లోకేశ్ విందు

- 25 ఏళ్లకే పెళ్లి చేయాలి... దేవాన్ష్‌ను ఇప్పటినుంచే ట్యూన్ చేస్తున్నా: నేతలతో నారా లోకేశ్ ఫన్నీ కామెంట్స్
- కుటుంబ సభ్యులతో సహా హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు
- రాజకీయాలకు దూరంగా ఆహ్లాదకర వాతావరణంలో భేటీ
- నియోజకవర్గ సమస్యల పురోగతిపై నేతలకు నివేదికల అందజేత
- మహిళలకు మంగళగిరి పట్టుచీరలు బహూకరించిన లోకేశ్

- మిగతా2లో

### ఎన్సీఈఆర్టీ వివాదాస్పద పాఠ్యపుస్తకంపై సంపూర్ణ నిషేధం



- న్యాయవ్యవస్థను కించపరిచే అంశాలను మరే రూపంలోనూ వ్యాప్తి చేయరాదు
- సుప్రీంకోర్టు సీజేఐ ధర్మాసనం ఆదేశం
- వివాదాస్పద పాఠ్యాంశంపై క్షమాపణలు తెలిపిన కేంద్రం

- మిగతా2లో

### నా ముఖం ఇచ్చేయండి.. చిక్కుల్లో 'ఏఐ మంత్రి'

అవినీతిని నిరోధించేందుకు యూరప్ దేశం అల్బేనియా కృత్రిమ మేధ ఆధారిత 'డియెల్లా' అనే అసిస్టెంట్‌ను ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. ప్రజాధనంతో చేపట్టే ప్రాజెక్టుల పర్యవేక్షణ కోసం నియమించిన ఈ వర్చువల్ మహిళను ఏఐ మంత్రిగా ప్రకటించడం ప్రపంచదేశాలను ఆశ్చర్యపరిచింది. అక్కడి పార్లమెంటులోనూ ఏఐ మంత్రి ప్రసంగించి వార్తల్లో నిలిచింది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. ఈ మంత్రికి ముఖరూపం కల్పించిన ఓ మహిళ.. ప్రభుత్వ చర్యలను తప్పుపడుతున్నారు. రాజకీయ కారణాల కోసం తన ముఖాన్ని

- మిగతా2లో



# 2027 గోదావరి పుష్కరాలు

-మొదటిపేజీ తరువాయి

శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధ్యక్షతన నిన్న సచివాలయంలో జరిగిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రులు కందుల దుర్గేశ్, సత్యకుమార్ యాదవ్, బీసీ జనార్దన్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు పన్నెండు రోజుల పాటు జరగనున్న ఈ పుష్కరాలను ఆరు జిల్లాల్లో ఘనంగా నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రస్తుతం ఉన్న 234 ఘాట్లకు అదనంగా మరిన్ని నిర్మించి, మొత్తం 369 స్నానఘట్టాలను ఏర్పాటు చేయాలని కమిటీ నిర్ణయించింది. కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కాకినాడ, పోలవరం జిల్లాల్లో ఈ ఏర్పాట్లు జరగనున్నాయి.

భక్తుల కోసం సాధారణ ధరలకే టెంట్ సిటీలు, హోమ్ స్టేలు ఏర్పాటు చేయడంతో పాటు పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారుల వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిటీ నిర్ణయించింది. పుష్కరాల ప్రధాన రోజుల్లో దాదాపు కోటి మంది వరకు భక్తులు రావొచ్చని అంచనా వేస్తున్న నేపథ్యంలో, భద్రతకు పెద్దపీట వేయాలని తీర్మానించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించనున్నారు.

# మద్యం కుంభకోణం నిందితుడు ముప్పిడి అవినాష్‌రెడ్డి అరెస్ట్

వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో ఆ ముఠా తరఫున లంచాల వసూళ్ల నెట్‌వర్క్ నిర్వహణ, డొల్ల కంపెనీలను అడ్డం పెట్టుకుని లంచాల సొమ్ము మనీ లాండరింగ్ చేయటంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన ముప్పిడి అవినాష్‌రెడ్డి ఎలియాస్ సుమిత్ (ఏ7) ఎట్టకేలకు అరెస్టయ్యారు. ఆయన ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డికి తోడల్లుడు. మద్యం కుంభకోణం దర్యాప్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఫిబ్రవరిలో సిట్ ఏర్పాటు చేసిన మరుక్షణమే అవినాష్‌రెడ్డి.. రాజ్ కెసిరెడ్డి ఆదేశాలతో థాయ్‌లాండ్‌కు పారిపోయారు. అప్పటి నుంచి విదేశాల్లోనే ఉన్నారు. సిట్ అన్ని వైపుల నుంచి ఉచ్చు బిగించటంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో సరిగ్గా ఏడాది తర్వాత గురువారం ఉదయం ఆయన సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు.

కొంతసేపు అవినాష్‌రెడ్డిని ప్రశ్నించిన దర్యాప్తు అధికారులు ఉదయం 11.30 గంటల సమయంలో ఆయన్ను అరెస్టు చేసి సాయంత్రం విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. శుక్రవారం (ఫిబ్రవరి 27) వరకూ ఆయనకు రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు న్యాయాధికారి భాస్కరరావు ఆదేశాలిచ్చారు. దీంతో అవినాష్‌రెడ్డిని గుంటూరులోని జిల్లా జైలుకు తరలించారు. ఈ కేసులో అరెస్టై, జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న పలువురు నిందితుల రిమాండ్ గడువు శుక్రవారంతో ముగియనుంది. తదుపరి రిమాండ్ కోసం వారంతా శుక్రవారం కోర్టులో హాజరుకావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అవినాష్‌రెడ్డికి శుక్రవారం వరకే రిమాండ్ విధించారు.

**బెయిల్ నిరాకరించడంతో గత్యంతరం లేక..**

దర్యాప్తు సమయంలో థాయ్‌లాండ్‌కు పారిపోయి అక్కడి నుంచి పలు దేశాలు తిరుగుతూ ఏడాదిపాటు గడిపిన అవినాష్‌రెడ్డిపై సిట్ అధికారులు గతంలోనే లుకౌట్ నోటీసులు జారీ చేశారు. తన అరెస్టు తప్పదని భావించిన ఆయన తొలుత ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేశారు. న్యాయస్థానం నిరాకరించటంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు కూడా ముందస్తు బెయిల్ ఇవ్వటానికి నిరాకరించి, లొంగిపోవాల్సిందేనని రెండు రోజుల కిందట స్పష్టమైన ఆదేశాలిచ్చింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో అవినాష్‌రెడ్డి గురువారం సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు.

**అన్ని వైపుల నుంచి ఉచ్చు బిగించిన సిట్**

ముప్పిడి అవినాష్‌రెడ్డిని విదేశాల నుంచి రప్పించే అంశంలో సిట్ అధికారులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. లుకౌట్ నోటీసుల జారీ మొదలుకుని అన్ని వైపుల నుంచి ఉచ్చు బిగించి అతనే విదేశాల నుంచి భారత్‌కు వచ్చే పరిస్థితి సృష్టించారు.

**రాజ్ కెసిరెడ్డి బెయిల్‌తో ముడిపడటంతోనే..**

మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డి గతేడాది ఏప్రిల్ 21న అరెస్టై జైల్లో ఉన్నారు. ఆయన తర్వాత అరెస్టైనవారికి బెయిల్ వచ్చినా రాజ్ కెసిరెడ్డి బెయిల్ పిటిషన్లు వివిధ కోర్టుల్లో పలుమార్లు తిరస్కరణకు గురయ్యాయి. ఇటీవల సుప్రీంకోర్టు సైతం ఆయనకు బెయిల్ ఇవ్వటానికి నిరాకరించింది. 'ముప్పిడి అవినాష్‌రెడ్డి మీ మనిషే. మీరే ఆయన్ను పారిపోయేలా ప్రోత్సహించారు. ముందు లొంగిపొమ్మని చెప్పండి. ఈ కేసులో అసలైన వ్యక్తి అవినాష్‌రెడ్డే. అతను మీ నీడ. మీరు తరలించిన సొమ్ముకు సంబంధించిన కంపెనీకి ఆయన నేతృత్వం వహిస్తున్నారు. అతను పరారీలో ఉన్నందున ప్రస్తుతం మీకు బెయిల్ మంజూరు చేయటం సరికాదు' అని విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రాజ్ కెసిరెడ్డి తరఫు వారు ఎట్టకేలకు ఆయన్ను రప్పించారు.

# ఘటనలు జరిగాక స్పందిస్తే ప్రయోజనం లేదు

-మొదటిపేజీ తరువాయి

తాగునీరు కలుషితమైన ఘటనలో ముందస్తు తనిఖీలు జరిగి ఉంటే ఈ సమస్య వచ్చేదే కాదు" అని అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్లు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ప్రతి ప్రభుత్వ విభాగంలో కింది స్థాయి యంత్రాంగాన్ని క్రియాశీలం చేసేందుకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రతి అధికారి విధిగా పర్యటించాలన్నారు. ఒక్కో సందర్భంలో ఒక్కో శాఖపై ఆకస్మిక తనిఖీకి వెళ్లడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని, కిందిస్థాయి అధికారులతో పాటు సంబంధిత శాఖల్లో జవాబుదారీతనం పెరుగుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. కలెక్టర్లు అంటే నిత్యం ప్రజల్లోనే ఉండాలని, అప్పుడే రాష్ట్ర స్థాయిలో అనుకున్న మార్పును తీసుకురాగలమని ఆయన పేర్కొన్నారు.

**శ్రీకాకుళంలో 107 మందికి చికిత్స: కలెక్టర్**

సమీక్షలో భాగంగా శ్రీకాకుళం జిల్లా కలెక్టర్, ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత పరిస్థితులను సీఎంకు వివరించారు. "జిల్లాలో ఇప్పటి వరకు 129 డయేరియా కేసులు నమోదు కాగా, ప్రస్తుతం 107 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 20 మంది కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. పైపుల ద్వారా నీటి సరఫరాను నిలిపివేసి, ట్యాంకర్ల ద్వారా సురక్షితమైన నీటిని అందిస్తున్నాం. నాలుగు ఇంజనీరింగ్ బృందాలు 40 లీకులను గుర్తించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. 150 మంది సిబ్బంది, 7 జేసీబీలు, 10 ట్రాక్టర్లతో పారిశుద్ధ్య పనులు చేపట్టాం. విశాఖ నుంచి మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌ను తరలిస్తున్నాం. ప్రభావిత ప్రాంతాల్లో 24 గంటలూ పనిచేసేలా మెడికల్ క్యాంపులు, ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశాం" అని తెలిపారు.

స్థానికులు వాటర్ ట్యాంకులు శుభ్రం చేసుకోకపోవడం, పైప్‌లైన్లు డ్రైన్లను క్రాస్ అవ్వడం, నీటి ప్రెజర్ లేకపోవడంతో మోటార్లు పెట్టి నీటిని తోడటం వల్ల కలుషిత నీరు ఇళ్లకు చేరిందని ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు వివరించారు.

**రాజమండ్రి ఘటనలో 8 మంది పరిస్థితి విషమం**

అనంతరం రాజమండ్రి కల్తీ పాల ఘటనపై తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సీఎంకు వివరాలు అందించారు. "ఈ నెల 22న వెలుగులోకి వచ్చిన ఈ ఘటనలో 20 మంది అనారోగ్యం పాలుకాగా, ఐదుగురు మృతి చెందారు. మరో 15 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా, వారిలో 8 మంది పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది. ప్రభావిత ప్రాంతాల్లో 9 వైద్య బృందాలు పనిచేస్తున్నాయి. 957 మందిని నిత్యం పర్యవేక్షిస్తున్నాం. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాం. నిందితుడైన పాల సరఫరాదారు గణేశ్వరరావును అరెస్ట్ చేసి విచారిస్తున్నాం. బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ఇతర ప్రాంతాల నుంచి వైద్య నిపుణులను, పరికరాలను తెప్పించి మెరుగైన చికిత్స అందిస్తున్నాం" అని కలెక్టర్ వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారని అధికారులు తెలిపారు. ఈ సమీక్షలో మంత్రులు నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, నిమ్మల రామానాయుడు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆన్‌లైన్ ద్వారా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం, రాజమండ్రి ఎమ్మెల్యేలు, రెండు జిల్లాల ఎస్పీలు కూడా పాల్గొన్నారు.

# ఇజ్రాయెల్‌తో వాణిజ్య ఒప్పందం

అమెరికా-ఇరాన్ ప్రతిష్టంభన కూడా వారి చర్చల్లో ప్రస్తావనకు వచ్చింది. మోదీ-నెతన్యాహు భేటీ అనంతరం- వాణిజ్యం, వ్యవసాయం, విద్య, ఇంధనం, సైబర్‌స్పేస్, డిజిటల్ చెల్లింపులు తదితర రంగాల్లో దిల్లీ-టెల్‌అవీవ్ మొత్తం 17 కీలక ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. సాంకేతికతల బదిలీ ఫ్రేమ్‌వర్క్ ద్వారా మిలిటరీ హార్డ్‌వేర్ సంయుక్త అభివృద్ధి, ఉత్పత్తి చేపడుతూ.. తమ మధ్య ఇప్పటికే ఉన్న సన్నిహిత రక్షణ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించుకోవాలని నిర్ణయించుకున్నాయి.

**భవిష్యత్ సాంకేతికతల కోసం భాగస్వామ్యం**

కృత్రిమ మేధ(ఏఐ), క్వాంటమ్, కీలక ఖనిజాల రంగాల్లో సహకారాన్ని మరింత పెంచుకునేందుకు భారత్-ఇజ్రాయెల్ కీలక, భవిష్యత్ సాంకేతికతల భాగస్వామ్యాన్ని ఏర్పరుచుకుంటున్నట్లు మోదీ ప్రకటించారు. ఇజ్రాయెల్‌లో యూపీఐ వినియోగానికి ఒప్పందం కుదిరిందన్నారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వంతో భారత భద్రతా ప్రయోజనాలు నేరుగా ముడిపడి ఉన్నాయని.. నెతన్యాహుతో భేటీ అనంతరం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో మోదీ పేర్కొన్నారు. సంఘర్షణలకు మానవాళి బలిపశువుగా మారకూడదంటూ, గాజా శాంతి ప్రణాళికకు భారత మద్దతును పునరుద్ఘాటించారు. ఉగ్రవాదానికి ప్రపంచంలో చోటు లేదన్నారు. ప్రధానుల చర్చల అనంతరం ఇరు దేశాలు ఉమ్మడి ప్రకటనను కూడా విడుదల చేశాయి.

**భారత్‌లో పెట్టుబడులు పెట్టండి**

ఏఐ, ఆరోగ్య సేవలు, వ్యవసాయం వంటి రంగాల్లో వినూత్న ఆవిష్కరణలను ప్రదర్శిస్తూ జెరూసలెంలో ఏర్పాటుచేసిన ఇన్నొవేషన్ ఎగ్జిబిషన్‌ను మోదీ సందర్శించారు. ఆయా ఆవిష్కరణలను చూసి ముగ్ధులయ్యారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఇజ్రాయెలీ టెక్నాలజీ కంపెనీలకు ఆయన పిలుపునిచ్చారు.

**ఇజ్రాయెల్ అధ్యక్షుడితో భేటీ**

ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఇసాక్ హెర్జోగ్‌తో మోదీ భేటీ అయ్యారు. విద్య, స్టార్టప్‌లు, నవకల్పనలు, సాంకేతికతలు, అనుసంధానం తదితర రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత పెంచుకోవడంపై చర్చించారు. ద్వైపాక్షిక మైత్రికి చిహ్నంగా మోదీ, హెర్జోగ్ ఓక్ చెట్టును నాటారు. భారత పర్యటనకు రావాలంటూ ఇజ్రాయెల్ అధ్యక్షుణ్ని భారత ప్రధాని ఆహ్వానించారు.

భారత సంతతికి చెందిన పలువురు యూదు ప్రముఖులు జెరూసలెంలో మోదీతో సమావేశమయ్యారు. ప్రధానిని కలిసినవారిలో రికీ షాపీ, ఇసాక్ థాంగ్జన్ తదితరులు ఉన్నారు. 2023 నాటి లెక్కల ప్రకారం- ఇజ్రాయెల్‌లో భారత సంతతి యూదుల సంఖ్య దాదాపు 85 వేలు. గూఢచర్యం నేపథ్యంలో రూపొందించిన ఇజ్రాయెలీ యాక్షన్ థ్రిల్లర్ సిరీస్ 'ఫౌదా' తారాగణంతో మోదీ కొద్దిసేపు ముచ్చటించారు. వారితో తీసుకున్న సెల్ఫీని సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఇజ్రాయెల్ పర్యటనను ముగించుకొని గురువారమే మోదీ స్వదేశానికి బయలుదేరి వచ్చారు.

**యాద్ వశెమ్ స్మారకం వద్ద నివాళులు**

జెరూసలెంలో ప్రపంచ హోలోకాస్ట్ (యూదులపై నాజీల మారణహోమం) స్మారక కేంద్రమైన యాద్ వశెమ్ దగ్గర పుష్పగుచ్ఛం ఉంచి నమస్కారం చేస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఉన్నారు. జెరూసలెంలోని యాద్ వశెమ్ స్మారకాన్ని నెతన్యాహుతో కలిసి మోదీ సందర్శించారు. యూదులపై నాజీల మారణహోమం(హోలోకాస్ట్)లో మృతులకు పుష్పాంజలి ఘటించారు. హోలోకాస్ట్‌లో మరణించినవారి పేర్లు ఉండే హాల్ ఆఫ్ నేమ్స్‌ను కూడా సందర్శించారు.

# ఎన్సీఈఆర్టీ వివాదాస్పద పాఠ్యపుస్తకంపై సంపూర్ణ నిషేధం

దిల్లీ: న్యాయవ్యవస్థ గౌరవ, మర్యాదలను దెబ్బతీసేలా పాఠ్యపుస్తకంలో అధ్యాయాన్ని చేర్చడం తమను తీవ్ర నిర్ఘాంతపరిచిందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. దీనికి బాధ్యులెవరో తేల్చాల్సిన బాధ్యత సుప్రీంకోర్టు అధినేతగా తనపై ఉందని, లోతైన దర్యాప్తు జరగాల్సి ఉందని తెలిపారు. వారిని వదిలిపెట్టబోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్సీఈఆర్టీ) ప్రచురించిన 8వ తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్యపుస్తకంపై సంపూర్ణ నిషేధం విధిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం గురువారం ఆదేశాలిచ్చింది. 'న్యాయవ్యవస్థలో అవినీతి' అనే అధ్యాయాన్ని చేర్చిన 'ఎక్స్‌ప్లోరింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్'(వాల్యూమ్-2) పాఠ్యపుస్తకం ప్రతులన్నింటినీ వెంటనే జప్తు చేయాలని, డిజిటల్ వ్యాప్తినీ అడ్డుకోవాలని, ఏ రూపంలోనూ పునర్ముద్రించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. వివాదాస్పద పాఠ్యపుస్తకంపై విచారణను సుమోటోగా చేపట్టిన ధర్మాసనంలో జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీ సభ్యులుగా ఉన్నారు. వివాదాస్పద అధ్యాయంలోని అంశాలను మారు శీర్షికలతో మరో రూపంలో లేదా ప్రత్యామ్నాయ విధానాల్లో ప్రచురించాలని యత్నించినా, వ్యాప్తిలోకి తీసుకొచ్చినా కోర్టు ధిక్కరణ చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని ధర్మాసనం హెచ్చరించింది. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా పాఠ్యాంశాన్ని రూపొందించిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోరాదో వివరించాలని ఆదేశిస్తూ ఎన్సీఈఆర్టీ డైరెక్టర్, కేంద్ర విద్యాశాఖ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఎన్సీఈఆర్టీ డైరెక్టర్ బుధవారం ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానం... పాఠ్యపుస్తకంలో ఏయే అంశాలున్నాయో పునఃపరిశీలించకుండానే బాధ్యతారాహిత్యంగా, నిర్లక్ష్యంగా, కోర్టును ధిక్కరించేలా ఉందని మండిపడింది. పాఠ్యపుస్తక రూపకల్పన, వివాదాస్పద అధ్యాయం చేర్చడానికి సంబంధించి తీసుకున్న నిర్ణయాలు, ఎన్సీఈఆర్టీ సమావేశం వివరాలు, బాధ్యులైన కమిటీ సభ్యుల పేర్లు, అర్హతల సమాచారాన్ని అందజేయాలని ఆదేశించింది. పాఠ్యపుస్తకం అంశాన్ని బాధ్యతాయుతంగా, సకాలంలో తమ దృష్టికి తెచ్చిన మీడియాకు ధర్మాసనం కృతజ్ఞతలు తెలిపింది.

ఆ పుస్తకాలను వెనక్కి తీసుకున్నాం: సొలిసిటర్ జనరల్‌కేంద్ర ప్రభుత్వం తరఫున గురువారం విచారణకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా భేషరతుగా క్షమాపణలు తెలిపారు. వివాదాస్పద పాఠ్యపుస్తకం ప్రతులు 32 మాత్రమే మార్కెట్‌లోకి వెళ్లాయని, వాటిని వెనక్కి రప్పించినట్లు ధర్మాసనానికి వివరించారు. మిగిలిన వాటిని పంపిణీచేయబోమన్నారు. వివాదాస్పద పాఠ్యపుస్తకంపై ఎన్సీఈఆర్టీ ఇప్పటికే క్షమాపణలు చెప్పింది.

## వైభవంగా... ఆహ్లాదకరంగా విరోష్ వివాహం

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ, ప్రముఖ నటి రష్మిక మందన్న గురువారం వివాహ బంధంతో ఒక్కటయ్యారు. కొంతకాలంగా ప్రేమలో ఉన్న ఈ జంట, అభిమానుల ఎదురుచూపులకు తెరదించుతూ పెళ్లి చేసుకున్నారు. వివాహం అనంతరం విజయ్ దేవరకొండ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పెళ్లి ఫొటోలు, వీడియోలను పంచుకుంటూ ఓ భావోద్వేగభరితమైన నోట్‌ను రాశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రష్మిక తన జీవితంలోకి ఎలా భాగమైందో వివరిస్తూ విజయ్ ఓ సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. "ఒకరోజు తను గుర్తొచ్చింది. తను పక్కన లేకపోతే నా రోజు అసంపూర్ణంగా అనిపించింది. తను ఎదురుగా కూర్చుని ఉంటేనే నా భోజనం సంపూర్ణంగా అనిపించేది. తనతో కలిసి వర్కౌట్లు చేస్తే అవి శిక్షలా కాకుండా సరదాగా అనిపించేవి. నేను ఎక్కడ ఉన్నా, ఇల్లు అనే భావన, ప్రశాంతత కలగాలంటే తను కావాలనిపించింది. అందుకే నా ప్రాణ స్నేహితురాలినే నా భార్యగా చేసుకున్నా" అంటూ రష్మికపై తనకున్న ప్రేమను విజయ్ అక్షర రూపంలో పంచుకున్నారు.

రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఉన్న 'మెమెంటోస్ బై ఐటీసీ హోటల్స్, ఏకాయ' వేదికగా వీరి వివాహ వేడుక అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యులు, చిత్ర పరిశ్రమకు చెందిన కొద్దిమంది మిత్రుల సమక్షంలో జరిగింది. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' వంటి చిత్రాల్లో కలిసి నటించి ప్రేక్షకుల మన్ననలు పొందిన ఈ జంట, నిజ జీవితంలోనూ ఒక్కటయ్యారు. పెళ్లి తర్వాత ఇరు కుటుంబాల వారు వేదిక బయట వేచి ఉన్న మీడియా సిబ్బందికి మిఠాయిలు పంచి తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ వివాహానికి 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్' అని అధికారికంగా పేరు పెట్టడం విశేషం. ఈ పేరును ప్లానర్లు గానీ, కుటుంబ సంప్రదాయాల ప్రకారం గానీ పెట్టలేదని, ఏళ్ల క్రితం తమ అభిమానులు ప్రేమగా తమ పేర్లను కలిపి సృష్టించిన 'విరోష్' అనే పేరునే ఎంచుకున్నామని ఈ జంట ఫిబ్రవరి 22న ప్రకటించింది. పెళ్లికి ముందు జరిగిన హల్దీ వేడుకకు సంబంధించిన ఫొటోలను కూడా విజయ్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకున్నారు. సంప్రదాయం, వ్యక్తిగత హంగులు కలగలిపి ఈ వేడుకను ఎంతో అందంగా నిర్వహించారు. ఎట్టకేలకు ఈ స్టార్ జంట పెళ్లి చేసుకోవడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## త్వరలో గ్రేడ్ ఆధారిత డ్రైవింగ్ లైసెన్సులు

-మొదటిపేజీ తరువాయి

పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) గురువారం దిల్లీలో నిర్వహించిన జాతీయ కాంక్లేవ్‌లో ఆయన ప్రసంగించారు. 'మేం గ్రేడ్ ఆధారిత డ్రైవింగ్ లైసెన్సుల వ్యవస్థను తీసుకురావాలనుకుంటున్నాం. ఈ విధానంలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు కొన్ని పాయింట్లు తగ్గుతాయి. అలా మొత్తం పాయింట్లు తగ్గితే డ్రైవింగ్ లైసెన్సును 6 నెలలపాటు సస్పెండు చేయడంగానీ, పూర్తిగా రద్దు చేయడంగానీ చేస్తాం. త్వరలో ఈ విధానాన్ని ప్రారంభిస్తాం' అని గడ్కరీ తెలిపారు.

## విమాన టికెట్ తీసుకున్న 48 గంటల్లో మార్పులు ఉచితం

-మొదటిపేజీ తరువాయి

మార్పుల్ని అంగీకరించేలా 'టికెట్ సొమ్ము వాపసు నిబంధన'ల్ని సడలించింది. మార్చి 26 నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. ప్రయాణ తేదీ ఏడు రోజుల కంటే తక్కువ ఉన్న దేశీయ ప్రయాణాలకు, 15 రోజులకంటే తక్కువ ఉన్న విదేశీ ప్రయాణాలకు మాత్రం ఇవి వర్తించవు. పేరులో ఏమైనా తప్పులు దొర్లినట్లు ప్రయాణికులు గుర్తించి, టికెట్ బుక్‌చేసిన 24 గంటల్లోపు చెబితే మార్పులకు ఎలాంటి ఛార్జీలు వేయరు. విమానయాన సంస్థల వెబ్‌సైట్ నుంచి, వాటి ఏజెంట్ల/పోర్టల్ నుంచి టికెట్లు కొంటే రిఫండ్ ప్రక్రియను 14 పనిదినాల్లో పూర్తిచేయాలని డీజీసీఏ ఆదేశించింది. ప్రయాణ సమయంలో ఒకే పీఎన్ఆర్ ఉన్న ప్రయాణికుల్లో ఎవరికైనా వైద్యపరమైన అత్యవసర పరిస్థితి తలెత్తి ఆసుపత్రిలో చేరాల్సి వచ్చి, టికెట్ రద్దు చేసుకుంటే సొమ్ము వాపసు చేయాలని, లేదంటే ఆ డబ్బును 'క్రెడిట్ షెల్'లో చూపించి.. తర్వాత వాడుకునే అవకాశం కల్పించాలని స్పష్టంచేసింది. ప్రయాణికుడి ఆరోగ్య పరిస్థితిని విమానయాన సంస్థ ఏరోస్పేస్ వైద్య నిపుణుడు ధ్రువీకరించాక రిఫండ్లు ఇస్తారు. టికెట్ల రిఫండ్ల సొమ్ము సకాలంలో రావడం లేదని వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. టికెట్ బుక్ చేసుకున్న తర్వాత 48 గంటల వరకు 'లుక్-ఇన్' ఐచ్ఛికాన్ని ఇవ్వాలని డీజీసీఏ ఆదేశించింది. ఆ వ్యవధిలో టికెట్ రద్దుకు, మార్పులకు అదనపు రుసుములు పడవు. మార్పును కోరుతున్న తేదీకి విమాన టికెట్ ధర ఎంత ఉందో అంత చెల్లిస్తే సరిపోతుంది. టికెట్ తీసిన 48 గంటల తర్వాతైతే మార్పులకు రుసుం చెల్లించాలి.

## నా ముఖం ఇచ్చేయండి.. చిక్కుల్లో 'ఏఐ మంత్రి'

-మొదటిపేజీ తరువాయి

వినియోగించేందుకు అంగీకరించే ప్రసక్తే లేదని, వెనక్కి ఇచ్చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అల్బేనియాకు చెందిన అనీలా బీషా కళాకారిణి. మూడు దశాబ్దాలుగా నాటక రంగం, తెరమీద నటిస్తూ ఎంతో ప్రసిద్ధి చెందారు. అయితే, 2025లో ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువచేసే లక్ష్యంతో రూపొందించిన ఓ ఆన్‌లైన్ పోర్టల్‌లో వర్చువల్ అసిస్టెంట్ (జఫ్తుఏశీ) కోసం తన ముఖాన్ని, వాయిస్‌ను వినియోగించుకునేందుకు అంగీకరించారు. డియెల్లా చాట్‌బాట్‌కు వాస్తవిక రూపం కల్పించేందుకు అనీలా గంటలపాటు నిలబడి మాట్లాడారు. యూజర్ ఇచ్చే ప్రశ్నలకు సహజంగా ప్రతి స్పందించేందుకు ఆమె నోటి కదలికలు, ప్రతి స్వరాన్ని రికార్డు చేశారు. చివరకు డియెల్లా అందుబాటులోకి వచ్చిన కొన్ని నెలల్లోనే 10లక్షలకుపైగా సంభాషణలు జరిగాయి. దాదాపు 36వేల డాక్యుమెంట్లను జారీ చేసింది. దీని పనితీరుపై ప్రభుత్వం, యూజర్ల నుంచి ప్రశంసలు వచ్చాయి.

## కర్నూలు, నరసరావుపేట కూటమి నేతలకు మంత్రి లోకేశ్ విందు

రాజకీయాల్లో ప్రజాప్రతినిధుల మధ్య ఉండే బంధం వారి కుటుంబాల మధ్య కూడా అనుబంధంగా మారాలనే ఉద్దేశంతో ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కర్నూలు, నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని కూటమి ప్రజాప్రతినిధులకు, వారి కుటుంబసభ్యులకు గురువారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆత్మీయ విందు ఇచ్చారు. ఈ సమావేశం పూర్తిస్థాయి రాజకీయాలకు దూరంగా, ఒక ఫ్యామిలీ గెట్-టుగెదర్‌ను తలపించింది. రాజకీయ ఒత్తిళ్లకు దూరంగా, పూర్తి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ విందు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నేతల కుటుంబసభ్యులు ఒకరికొకరు పరిచయం చేసుకుని, సరదాగా ముచ్చటించారు. మంత్రి లోకేశ్ ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరించి, వారి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. "పిల్లలు ఏం చేస్తున్నారు? ఎక్కడ సెటిల్ అయ్యారు?" అంటూ ఆప్యాయంగా వాకబు చేశారు. ఈ క్రమంలో ఆయన సరదాగా మాట్లాడుతూ.. అబ్బాయిలకు 25 ఏళ్లకే పెళ్లి చేయాలని, తనకు 24 ఏళ్లకే వివాహమైందని గుర్తుచేసుకున్నారు. తన కుమారుడు దేవాన్ష్‌కు కూడా 25 ఏళ్లకు పెళ్లి చేసుకోవాలని ఇప్పటి నుంచే ట్యూన్ చేస్తున్నానంటూ నవ్వులు పూయించారు. ఈ ఆత్మీయ కలయికలోనూ లోకేశ్ తనదైన మార్క్ చూపించారు. నియోజకవర్గాల అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం ఆయా నేతలు గతంలో తనకు ఇచ్చిన వినతిపత్రాలపై తీసుకున్న చర్యల పురోగతిని వివరిస్తూ ప్రత్యేక నివేదికలను వారికి అందజేశారు. ఎన్ని పనులు పూర్తయ్యాయి, ఏవి పరిశీలనలో ఉన్నాయి, ఇంకా ఏవి మొదలుకాలేదు అనే వివరాలను స్పష్టంగా తెలియజేశారు. విందుకు హాజరైన మహిళామణులను గౌరవిస్తూ వారికి మంగళగిరి పట్టుచీరలను ఆత్మీయంగా బహూకరించారు. విందు ముగిసిన అనంతరం, ఇంటి గేటు వరకు స్వయంగా వచ్చి ప్రతి ఒక్కరికీ ఆత్మీయంగా వీడ్కోలు పలికి వారిని సాగనంపారు.

# శాసనసభ్యుల క్రీడల్లో అద్భుతంగా రాణించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి.

- జావెలిన్ త్రో, షాట్ పుట్, టెన్నిస్, టీకిల్ బాల్, షటిల్ లో గెలుపు.
- టెన్నికాయిట్ మ్యూజికల్ చైర్ లో రన్నర్ గా నిలిచిన ఎమ్మెల్యే.

**పుట్టపర్తి, పెన్ సత్తా, పిబ్రవరి 26:** రాష్ట్ర శాసనసభ్యుల క్రీడా పోటిల్లో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సిందూర రెడ్డి అత్యంత ఉత్సహంగా పాల్గొని అద్భుతంగా రాణించారు. విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ లో గురువారం నిర్వహించిన జావిలిన్ త్రో క్రీడలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మిగతా సహచర మహిళా ప్రజా ప్రతినిధుల కంటే అధిక దూరానికి విసిరి ప్రథమ స్థానంలో నిలిచారు. మ్యూజికల్ చైర్ లో ఉత్కంఠంగా సాగిన ఈ పోటీలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి విన్నర్ గా, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి రన్నర్ గా నిలిచారు. టెన్నికాయిట్ క్రీడలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి శ్రావణి మధ్య పోటీ ఆసక్తికరంగా సాగింది. ఈ పోటీలో బండారు శ్రావణి విన్నర్ గా నిలిచారు.

టెన్నిస్ డబుల్స్ లో సింగనమల ఎమ్మెల్యే శ్రావణి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఒక టీమ్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, సూళ్లూరు పేట ఎమ్మెల్యే విజయశ్రీ ప్రత్యర్థి జట్టుగా ఆడారు. ఈ పోటీలో సింధూర రెడ్డి, బండారి శ్రావణి జట్టు గెలుపొందింది.

టికిల్ బాల్ క్రీడలో... సిందూర రెడ్డి, బండారు శ్రావణి మరియు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, విజయశ్రీ లతో కలిసి పోటీ ఆసక్తికరంగా సాగింది. ఈ పోటీలో బండారు శ్రావణి, పల్లె సిందూరా రెడ్డి లు గెలుపొందారు. ఈ శాసనసభ క్రీడా పోటీల్లో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అత్యంత ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొని, తన ప్రతిభను కనబరుస్తూ వివిధ క్రీడల్లో అద్భుతంగా రాణించి ప్రథమ స్థానంలో నిలిచారు. క్రీడల్లో రాణిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిని సహచర మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు సహచర జట్టు సభ్యులు ప్రత్యేకంగా అభినందించి ప్రశంసించారు.







# దీరాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు భద్రత ఏర్పాట్ల పర్యవేక్షణ.




క్షేత్ర స్థాయిలో భద్రత ఏర్పాట్లును పరిశీలించిన జిల్లా ఇన్చార్జ్ ఎస్పీ.

**విజయనగరం, పెన్ సత్తా, పిబ్రవరి 26:**రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలోని చీపురుపల్లి మండలం, రావివలస గ్రామం లో పెన్షనలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఫిబ్రవరి 28 న విచ్చేస్తున్న సందర్భంగా క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లును, భద్రత, బందోబస్తు ఏర్పాట్లును జిల్ల ఇన్చార్జ్ ఎస్పీ కే.వి.మహేశ్వర రెడ్డి, కలెక్టరు ఎస్.రామ సుందర రెడ్డి, అదనపు ఎస్పీ పి. సౌమ్యలత, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, ప్రజా వేదిక, పెన్షన్లు పంపిణీ చేసే ఇండ్లను, కార్యకర్తలతో సమావేశం కానున్న ప్రాంగణంను అధికారులు సందర్శించి, నిర్మాణ పనులను, ఏర్పాట్లును పరిశీలించి, సంబంధిత అధికారులకు ఇన్చార్జ్ ఎస్పీ కే.వి.మహేశ్వర రెడ్డి పలు సూచనలు చేసారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్, రూట్ బందోబస్తు, రూఫ్ టాప్, హెల్డింగ్ పాయింట్స్, ప్రెజర్ పాయింట్స్ వద్ద ఏర్పాటు చేయనున్న బందోబస్తు, భద్రత ఏర్పాట్లను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. ముఖ్య మంత్రి పర్యటనలో పోలీసు సిబ్బంది, అధికారులు వ్యవహరించాల్సిన తీరు, చేపట్టాల్సిన భద్రత చర్యల పై జిల్లా ఎస్పీ కే.వి.మహేశ్వర రెడ్డి అధికారులు, సిబ్బందికి స్పష్ట మైన ఆదేశాలు జారీ చేసి, దిశా నిర్దేశం చేసారు. రోప్ పార్టీలు, రూట్ మూవింగ్ బందోబస్తు, నిర్వహించే సిబ్బంది కాన్వాయ్ మార్గంలో ఎటువంటి మార్గం ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. రహదారి పై వాహనాలు నిలపకుండా పార్కింగ్ ప్రాంతాల్లో మాత్రమే నిలిపే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రూఫ్ టాప్ లపై విధులు నిర్వహించే భద్రత సిబ్బంది చుట్టూ ఉన్న ప్రాంతాలను బైనాక్యులర్స్ నిశితంగా పరిశీలించాలన్నారు. విధుల్లో ఎటువంటి నిర్లక్షం వద్దని, సమన్వయంతో పని చేయాలని, ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతీ ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని, విధులు నిర్వహించాలన్నారు. భద్రత విధులు నిర్వహించే సిబ్బంది, అధికారులకు తాము నిర్వహించే విధుల పై స్పష్ట మైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్య వ్యక్తులు, నాయకులు, ప్రజల వాహనాలను పార్కింగు చేసేందుకు ప్రత్యేకంగా పార్కింగు స్థలాలను ఏర్పాటు చేయాలని అధికారులను జిల్లా ఇన్చార్జ్ ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు ఎస్.రామ సుందర రెడ్డి, జాయింట్ కలెక్టరు సేతు మాధవ్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు, చీపురుపల్లి సిఐ జి.శంకరరావు, ఎస్బి సిఐ ఎ.వి.లీలారావు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, పలువురు సిఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గీతం లో ప్రకృతి వ్యవసాయ కొనుగోలు దారులువిక్రేతల సమావేశం

**విశాఖపట్నం, పెన్ సత్తా, పిబ్రవరి 26:**జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 26 న విశాఖపట్నం గీతం విశ్వవిద్యాలయంలో ప్రకృతి వ్యవసాయ కొనుగోలు దారులువిక్రేతల నెట్వర్కింగ్ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో రైతు సాధికార సంస్థ విజయ్ కుమార్ (ఈవీసీ,ఆర్వైఎస్ఎస్) జూమ్ ద్వారా పాల్గొని, రైతులు విలువ ఆధారిత సేవలను చేపట్టి రైతులుగా కాకుండా వ్యాపారవేత్తలుగా మారాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం వచ్చే ఏడాది నుంచి రాష్ట్రం లోని 13,300 గ్రామ పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయశీ ప్రారంభించాలనే లక్ష్యాన్ని వెల్లడించారు.

గీతం విశ్వవిద్యాలయం , ఆర్వైఎస్ఎస్ తో కలిసి శాస్త్రీయ సాంకేతికత, పరిశోధనల ద్వారా ప్రకృతి వ్యవసాయ సహకరించనున్నట్లు తెలిపింది.

కాకినాడకు చెందిన శ్రీలక్ష్మి, నేచురల్స్ యజమాని నాగలక్ష్మి, కుమారుడితో పాటు మరో నలుగురికి 30,000 /- ఉపాధి కల్పించిన విధానం పై ఈవీసీ అభినందనలు తెలిపారు. అలాగే అవని ఆర్గానిక్స్ డైరెక్టర్ బిందు కృషిని ప్రశంసించారు. ఆర్వైఎస్ఎస్ సీనియర్ అధికారులు ప్రణయ్ భార్గవ్, విజయ్ నర్సింగ్ మాట్లాడుతు గ్రామ స్థాయి రైతులు, కొనుగోలుదారులువిక్రేతల మధ్య ఉన్న మార్కెటింగ్ లోపాలను వివరించారు. ఈ సమావేశం లక్ష్యం, మార్కెటింగ్, బ్రాండింగ్, ప్యాకేజింగ్, సర్టిఫికేషన్, పీఎండీఎస్ రుణాల పై రైతులు, కొనుగోలుదారులకు నిపుణుల ద్వారా స్పష్టమైన అవగాహన కల్పించడం. జి – టెక్ ఏకే కో ఆర్డినేటర్(గీతం విశ్వవిద్యాలయం ) డా. ప్రసాద రావు, నేచురల్ ఫార్మింగ్ మార్కెటింగ్ పై ఆలోచనల అభివృద్ధికి సంస్థ సహకరిస్తుందని తెలిపారు. విశాఖపట్నం ఏపీసిఎన్ఎఫ్ డీపీఎం మోహన్ రావు మార్కెటింగ్కు నాణ్య మైన ఉత్పత్తులు అందించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ఉత్తర తీర ప్రాంత రీజినల్ టెక్నికల్ లీడ్ ప్రకాష్, ఆర్వైఎస్ఎస్ ను పూర్తి స్థాయి వేదికగా ఉపయోగించి కొనుగోలుదారులు, విక్రేతల సమావేశాలను బలోపేతం చేయాలని సూచించారు. అలాగే అగ్రిగేటర్లు, ఎంటర్ప్రెన్యూర్స్, న్యూస్ రిటైలర్లు తమ అనుభవాలను కూడా పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ హార్టికల్చర్ ఆఫీసర్ శ్యామల, ప్రాజెక్ట్ డైరెక్టర్ (పిడి ఎపి. యం ఐ పి) మన్మధ రావు, ఉత్తరాంధ్ర జిల్లాల డిపిఎం లు, అడిషనల్ డీపీఎం లు, అగ్రిగేటర్స్ ఫార్మర్స్ ప్రాసెస్ రిటైలర్ సర్వీస్ ప్రొవైడర్స్, రైతులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.






# పోలియో ఫండ్ రైజింగ్ సైకిల్ యాత్ర

**అనకాపల్లి, పెన్ సత్తా, పిబ్రవరి 26:**రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ కళ్యాణ్ చక్రవర్తి, మల్లికార్జున రావు, గోపాలరాజు, బాబి లు పోలియో ఫండ్ రైజింగ్ సైకిల్ యాత్ర ను ఫిబ్రవరి 18 ఇచ్ఛాపురం నుండి బయలుదేరి సోమవారం విశాఖపట్నం చేరుకుంది. ఫేస్ 2 యాత్ర లో విశాఖపట్నం నుండి బయలుదేరి గురువారం అనకాపల్లి సుంకరమెట్ జంక్షన్ కు చేరుకుంది. ఈ సందర్భంగా వారికి అనకాపల్లి పట్టణ రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. పోలియో ఫండ్ పెంచాలని ఒక మంచి ఆశయంతో ఆయన 57 సంవత్సరాల వయసులో ఇచ్ఛాపురం నుంచి కాకినాడ వరకు అన్ని రోటరీ క్లబ్స్ నీ కలుస్తూ సైకిల్ రైడ్(550 కిలో మీటర్లు) మొదలు పెట్టారు. ఈ కార్యక్రమంలో

పట్టణ రోటరీ క్లబ్ బుద్ధ శ్రీనివాసరావు, క్లబ్ కార్యదర్శి కెవిపిఎస్ ప్రకాష్ రావు, కోశాధికారి బి సర్వారావు, బుద్ధ సత్యనారాయణ, సాన త్రినాధ, క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## కాఫీ కబుర్లు కార్యక్రమంలో మంత్రి సవిత




**మంగళగిరి, పెన్ సత్తా, పిబ్రవరి 26:**టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం పార్టీ క్లస్టర్ ఇన్చార్జ్లతో నిర్వహించిన కాఫీ కబుర్లు కార్యక్రమంలో రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్. సవిత, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి సవిత దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలే అధినేత అన్నది టీడీపీ సిద్ధాంతమని ఆమె పేర్కొన్నారు. జెండా మోసి పార్టీ అభివృద్ధికి కృషి చేసిన కార్యకర్తలకు సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సముచిత స్థానం కల్పిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు.

## గ్రామాల అభివృద్ధి కోసం మంత్రి సత్య కుమార్ కి వినతులు అందించిన నాయకులు

ప్రజా అవసరాల పై మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎన్డీఏ కూటమి ప్రతినిధులు




**ధర్మవరం, పెన్ సత్తా, ఫిబ్రవరి 26:** ధర్మవరం నియోజకవర్గ ఎన్డీఏ కూటమి నాయకులు గురువారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సమావేశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిపాలనా కేంద్రంలో జరిగింది. వారి గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలు, భవిష్యత్ సంక్షేమ కార్యక్రమాల పై విస్తృతంగా వీరు చర్చించారు. ఈ సందర్భంగా ధర్మవరం నియోజకవర్గానికి చెందిన ఎన్డీఏ కూటమి నాయకులు గ్రామాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు అవసర మైన సేవల మెరుగుదల, ఆరోగ్య సదుపాయాల విస్తరణ వంటి విషయాల పై తమ అభ్యర్ధనలు వివరించారు. ఈ సమావేశంలో ధర్మవరం నియోజకవర్గ ఎన్డీఏ కూటమి నాయకులు కోటి బాబు, చిగిచెర్ల ఓబీరెడ్డి, వసంతపురం రమేష్ తదితరులు పాల్గొన్నారు. వారు తమ తమ గ్రామాలలో ఎదురవుతున్న సమస్యలు, అభివృద్ధి అవసరాలు మరియు ప్రజల ఆశలుఆకాంక్షలను వివరంగా మంత్రిగారికి వివరించారు. మంత్రి నాయకులు ప్రస్తావించిన అంశాలను శ్రద్ధగా విని, ప్రజలకు మేలు చేకూరే విధంగా సాధ్య మైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ధర్మవరం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రజలకు అవసర మైన సేవలు మరింత సమర్థవంతంగా అందేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు. ఈ సమావేశం ధర్మవరం ప్రాంత అభివృద్ధికి సంబంధించి సానుకూల దిశలో ముందడుగుగా నిలుస్తుందని నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.

# నందనం గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ.

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ద్వారా విగ్రహావిష్కరణ.
- ఎమ్మార్పీఎస్ మరియు విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో.













**వలిగొండ మండలం పెన్ సత్తా, ఫిబ్రవరి 26:**యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో నందనం గ్రామం లో భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహం ఆవిష్కరించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గౌరవ శ్రీ, వంగపల్లి శ్రీనివాస్ మాదిగ , ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి. అంబేద్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షులు కొండాపురం శ్రీనివాస్, మాదిగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో

ఉపాధ్యక్షులు ములుగు నాగరాజు, నందనం గ్రామ సర్పంచ్ నాగలి గిరిజ రమేష్ గౌడ్ గారు , మాజీ సర్పంచ్ కడమంచి ప్రభాకర్,, ములుగు లక్ష్మయ్య ఉప సర్పంచ్, మట్ట ధనంజయ గౌడ్ బి ఆర్ ఎస్ నాయకులు, దళితరత్న శ్రీ చిలుకమార్ గణేష్ మాదిగ గారు, కళ్లెం రంగయ్య, ములుగు నాగరాజు,వార్డు మెంబర్, మట్ట కుమార్ గౌడ్, కంటేశ్వరం ఓంకారం, కొండాపురం సరితా బిక్షపతి, కొలను అండలు పెంటా రెడ్డి గారు, గోరుగంటి గణేష్, ముగ్గు భీమయ్య, హానరాశి రేఖ నరేష్, పంచాయతీ కార్యదర్శి ఎండి షబానా, మరియు కొండాపురం చంద్రయ్య, కొండాపురం బిక్షపతి, కొండాపురం రాము, పొట్ట కిరణ్ కుమార్, అల్లంపల్లి జాంగిర్, కొండాపురం సుదర్శన్, తదితరులు పాల్గొని అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరించడం జరిగింది. మీడియా ద్వారా నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని అప్పుడే ఆయన రచించిన రాజ్యాంగానికి విలువ ఇస్తున్నట్లు అని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వలిగొండ మండల నాయకులు పాశం సత్తిరెడ్డి చెరుకు శివయ్య కాసుల వెంకన్న బోళ్ల శ్రీను కొండూరు సాయి గరిసె రవి పలుసం సతీష్ మరియు కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మార్చి 8 న అమ్మవారి పునర్నిర్మాణ కలశ స్థాపన, ప్రతిష్ట మహోత్సవము



**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 26:**ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గవరపాలెంలో వెలసిన నూకాంబిక అమ్మవారి మార్చి 8 న జరగనున్న పునర్నిర్మాణ కలశ స్థాపన, ప్రతిష్ట మహోత్సవముల ఆహ్వానపత్రిక లను గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ప్రారంభించారు. ఆలయ ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలు అన్నీ కూడా ఎటువంటి లోటుపాటులు లేకుండా పరిపూర్ణంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్ కుమార్, దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్ కుమార్, మారిశెట్టి శంకర్రావు, కాంద్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

# చెత్త రహిత పాలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

- సమస్త జీవరాశినీ కాపాడుకోవాలి.
- మన విశాఖ ను మనమే దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలి.
- విద్యార్థులు అందరూ గ్రీన్ సోల్జర్స్ గా తయారు అవ్వాలి.
- జెవి రత్నం , వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ.

**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 26:**చెత్త రహిత పాలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం కోరారు. గురువారం ఉదయం మధురవాడ దగ్గర మిధిలాపురి లోని గ్లోబ్ విద్యా సంస్థలో ప్రిన్సిపాల్ లలిత అధ్యక్షతన గ్రీన్ క్లైమేట్ టీం నేతృత్వంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర లో భాగంగా చెత్త రహిత పరిపాలన (జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్) కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మన విశాఖ నగరంలో ఎక్కడా చెత్త పారవేయరాదని, జి విఎంసి వాహనాలకు చెత్త ఇవ్వాలని కోరారు. మన విశాఖ ను మనమే దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. సమస్త జీవరాశినీ కాపాడు కోవాలి అని వివరించారు. ఏ జీవి అంతరించినా మానవాళి మనుగడే ప్రమాదంలో పడుతుంది అన్నారు. విద్యార్థులు అందరూ పర్యావరణ పరి రక్షణ, జీవవైవిధ్య పరి రక్షణ, పరిసరాల పరిశుభ్రత కోసం గ్రీన్ సోల్జర్స్ గా తయారు అవ్వాలి అని పిలుపునిచ్చారు. విద్యార్థులు, మహిళలు, నగరవాసులు అందరూ చెత్త రహిత నగరంగా విశాఖ మహానగరాన్ని తీర్చి దిద్దడానికి కృషి చేయాలని కోరారు. మన అంద మైన నగరాన్ని ఒక సుందర మైన వనంగా తీర్చి దిద్దాలని కోరారు. వంటింటి వ్యర్థాలతో ఎరువు తయారు చేసి ఎవరి ఇంటి వద్ద వారె కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించడం అవసరం అని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లలిత, గ్రీన్ వాలంటీర్ ఐ కృష్ణ కుమారి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.








# ఏ.ఎం.ఏ.ఎల్.కళాశాలలో ఏయూ బాలుర ఖోఖో పోటీలు ప్రారంభం





**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 26:**ఆంధ్ర విశ్వ విద్యాలయం 100 సంవత్సరాల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సెంటినరీ ఉత్సవాలలో భాగంగా ఏయూ ఖో ఖో పురుషుల పోటీలు గురువారం ఏఎంఏఎల్ కళాశాలలో పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

ఈ పోటీలలో సుమారు 7 జట్లు క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలకు కాలేజీ కరస్పాండెంట్ పెంటకోట వెంకట రామారావు ( శ్రీను) పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకొని, పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ అధ్యక్షులు శ్రీధరాల కృష్ణ పేర్రాజు, ప్రిన్సిపాల్ జి. జయాబాబు, వైస్ ప్రిన్సిపాల్ టి. నిరంజన్ కుమార్, జి.బి. మెంబర్ వాసిరెడ్డి బాలకృష్ణ, సూపరింటెండెంట్ పి.అనురాధ, సెలక్షన్ కమిటీ సభ్యులు కే. చక్రవర్తి, డా. ఆర్. కిరణ్మయి, ఫిజికల్ డైరెక్టర్ డా. కె వి.ఎస్. నాయుడు, స్టాఫ్ హాజరయ్యారు.

# మార్కెట్ యార్డ్ కార్యాలయం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన చింతమనేని







**దెందులూరు, పెన్ సత్తా, ఫిబ్రవరి 26:**
కూటమి ప్రభుత్వంలో దెందులూరు వ్యవసాయ మార్కెట్ యార్డును అన్ని విధాల అభివృద్ధి చేసి తద్వారా రైతులకు అండగా నిలుస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదవేగి మండలం, లక్ష్మీపురం లోని దెందులూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో రూ. కోటి 30 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయం భవన నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో గురువారం సాయంత్రం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డుకు విచ్చేసిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కి ఏఎంసి చైర్పర్సన్ గారపాటి రామ సీత, లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ మేక కనకరాజు సహా పలువురు ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు అధికారులు పుష్పగుచ్చాలను అందించి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కనీసం ధాన్యం బకాయి డబ్బులు కూడా చెల్లించకుండా రైతులను తీవ్ర ఇబ్బందులు పాలు చేశారని, అయితే కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత రైతుల గత ధాన్యం బకాయిలు చెల్లించడంతోపాటు, ధాన్యం కొనుగోలు చేసిన గంటల వ్యవధి లోనే రైతులకు దాన్యం సొమ్ము కూడా నేరుగా వారీ ఎకౌంటుకి నేరుగా బదిలీ అయ్యేలా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత దెందులూరు వ్యవసాయం మార్కెట్ యార్డును కూడా అన్ని విధాల అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని, మార్కెట్ యార్డులో అహర్నిశలు కష్టపడి పని చేసే హమాలీల కోసం రూ.4 లక్షల రూపాయలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు అదనంగా మరో రూ.లక్ష 60 వేలు కేటాయించి కూలింగ్ ప్లాంట్ ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా గతంలో నిలిచిపోయిన ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులను సైతం రూ.20 లక్షల రూపాయలతో పూర్తి చేస్తున్నామని, రూ.27 లక్షలు తో ప్రహరీ గోడ నిర్మించటమే కాకుండా ఇప్పటికే రూ.4.5 కోట్ల రూపాయలు సెస్ వసూలుతో, సెస్ వసూలు లక్ష్యాలను 55% పై చేశామని తెలిపారు. కొత్తగా మరో 2 చెక్ పోస్ట్ లు కూడా ఏర్పాటు చేశామని, ఈ విధంగా కూటం ప్రభుత్వం ఆధ్వర్యంలో దెందులూరు వ్యవసాయ మార్కెట్ యార్డును సమగ్ర అభివృద్ధి చేసి రైతులకు మరింత మేలు కలిగేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే చింతమనేని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ గారపాటి రామసీత, ఏలూరు ఇన్చార్జి ఆర్డీవో దేవకీ, బిజెపి జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్, తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బొప్పన సుధా, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ సీనియర్ నాయకులు మాగంటి సురేంద్రనాథ్ చౌదరి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పలపాటి రాంప్రసాద్, పెదవేగి సొసైటీ చైర్మన్ తాత సత్యనారాయణ, లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ మేక కనకరాజు, పెదవేగి సర్పంచ్ తాత శ్రీరామ్ మూర్తి, విజయవాడ కనకదుర్గ ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు మోరు శ్రావణి, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లావేటి శ్రీనివాస్ గారు, యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్ గారు, మండల పార్టీల అధ్యక్షులు ఈడుపుగంటి అనిల్ గారు, మరడాని రవి గారు, నంబూరి నాగరాజు గారు, దెందులూరు మండల పార్టీ సెక్రటరీ నాగలబోయిన సత్యనారాయణ గారు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మోతుక్కారి నాని గారు, ఏలూరు పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి గుత్తా అనిల్ గారు, దెందులూరు సొసైటీ చైర్మన్ గారపాటి కొండయ్య చౌదరి గారు, మొండూరు సొసైటీ చైర్మన్ కొనకళ్ళ శివమణి గౌడ్ గారు, పెదపాడు సొసైటీ చైర్మన్ గారపాటి స్టాలిన్ గారు, చాటపర్రు సొసైటీ చైర్మన్ కాలారి శ్రీనాథ్ చౌదరి గారు, గాలయ గూడెం సొసైటీ చైర్మన్ పూజారి వెంకటరత్నం నాయుడు గారు, జనసేన నాయకులు గరికపాటి చంటి బాబు గారు సహా పలువురు ప్రజాప్రతినిధులు , సొసైటీల చైర్మన్లు, కూటమి నాయకులు, క్లస్టర్ ఇన్చార్జిలు అధికారులు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.





## స్థానిక కేజీబీవీ పాఠశాలలో హెచ్పీవీ టీకాపై అవగాహన కార్యక్రమం



**పెన్ సత్తా, ఫిబ్రవరి 26:** స్థానిక కేజీబీవీ పాఠశాలలో బాలికల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి హెచ్పీవీ టీకాపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ బి. రాములు పాల్గొని బాలికలకు హెచ్పీవీ టీకా ప్రాముఖ్యతను సవివరంగా వివరించారు.

14 నుండి 15 సంవత్సరాల వయస్సులో ఈ టీకా తీసుకోవడం ద్వారా గర్భాశయ ముఖ క్యాన్సర్‌కు ముందస్తు రక్షణ కల్పించవచ్చని తెలిపారు. అలాగే ఈ టీకా వల్ల శరీరంలోని రోగనిరోధక శక్తి బలపడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా 14 నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలు ఈ టీకా తీసుకోవడం ద్వారా గర్భాశయ ముఖ క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని 85 నుండి 90 శాతం వరకు తగ్గించుకోవచ్చని తెలియజేశారు.

ఈ టీకాను ప్రైవేటుగా వేయించుకుంటే సుమారు నాలుగు వేల నుండి ఐదు వేల రూపాయల వరకు ఖర్చు అవుతుందని, అయితే ప్రభుత్వం 2026 సంవత్సరం నుండి ఈ టీకాను ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ టీకాను వైద్యుల పర్యవేక్షణలో ఒక్క మోతాదుగా వేయడం జరుగుతుందని వివరించారు.

ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో గర్భాశయ ముఖ క్యాన్సర్ రెండవ స్థానంలో ఉన్న వ్యాధిగా గుర్తించబడిందని, సరైన వయస్సులో ఈ టీకా తీసుకోవడం ద్వారా దాదాపు 90 శాతం వరకు ఈ వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. అందువల్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది కలిసి యవ్వన దశలో ఉన్న బాలికలకు ఈ టీకా వేయించేందుకు ప్రోత్సహించడం ఎంతో అవసరమని సూచించారు.

గర్భాశయ ముఖ క్యాన్సర్ నిర్మూలన దిశగా ఈ టీకా ఎంతో ఉపయోగకరమని వైద్యాధికారి తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య నర్సు పుణ్యవతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం రమణ మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న పొలంపల్లి బస్సు స్టాండ్

- ఎన్నిసార్లు మొరపెట్టిన పట్టించుకోని ప్రభుత్వాలు
- నిర్మాణం ఎప్పుడు
- ఈ ప్రభుత్వమైనా నిర్మించాలి,



**చేగుంట పెన్ సత్తా, ఫిబ్రవరి 26:**/చేగుంట మండల్ పొలంపల్లి గ్రామంలో బస్సు స్టాండ్ శిథిలావస్థలో ఉంది ఒకప్పుడు ప్రజలకు రవాణా సౌకర్యంగా ఉండేది కానీ ఇప్పుడు ఇది శిథిలావస్థ పరిస్థితి, వివరాల ప్రకారం, చేగుంట నుండి మెదక్ వెళ్లే రహదారిలో మొదటి బస్టాండ్ పొలంపల్లి, గత కొన్ని సంవత్సరాలు బస్టాండ్ లేకపోవడంతో ప్రజలు ఎంతో ఇబ్బంది పడేవారు, సుమారు 25 లకు ముందు బస్సు స్టాండ్ లేదు, పొలంపల్లి గ్రామానికి, రామయంపేట మాజీ శాసనసభ్యులు, రమణగారి వాసు రెడ్డి, సహకారంతో అదే గ్రామానికి చెందిన ఫారెస్ట్ చైర్మన్ గా ఉన్న చౌడం కిష్టయ్య, పొలంపల్లి బస్టాండ్ నిర్మాణం కొరకు, ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి పొలంపల్లి గ్రామానికి, బస్సు స్టాండ్ లేదు ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది ఉంది, ఫారెస్ట్ అధికారులకు, తెలపడంతో వారు సానుకూలంగా స్పందించి, ఫారెస్ట్ పై అధికారులతో మాట్లాడి వారి సహకారంతో బస్ స్టాండ్ నిర్మించారు, ఆ బస్టాండ్ నిర్మాణం కోసం, వాసు రెడ్డి, చౌడం కిష్టయ్య, కృషి పట్టుదల, మెదక్ వైపు వెళుతున్న ప్రజలకు వర్షాకాలము మరి ఎండాకాలం ఎంతో ఉపయోగపడేది చదువుకునే పిల్లలు కూడా,నీడల ఉన్న బస్సు స్టాండ్ శిథిలావస్థలో ఉన్న బస్టాండ్ ప్రజలు ఇబ్బందులు పడకుండా బస్సుస్టాండ్ నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించి బస్సు స్టాండ్ నిర్మించి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని పొలంపల్లి గ్రామ ప్రజల విజ్ఞప్తి,

## సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ వైద్య సౌకర్యం అమలు చేయాలి.

- సీఎం పిఎఫ్ వివరాలు అందజేయాలి
- ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో కొండాపురం సి ఎస్ పి డిజిఎం వి మదన్ నాయక్ కి వినతిపత్రం అందజేసిన కాంట్రాక్ట్ కార్మికులు.




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 26:**సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ వైద్య సౌకర్యం అమలు చేయాలనీ సీఎం పిఎఫ్ వివరాలు అందజేయాలనీ కోరుతూ ఐఎఫ్ టియు ఆధ్వర్యం లో గురువారం నాడు కొండాపురం సి ఎస్ పి డిజిఎం వి మదన్ నాయక్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏరియా అధ్యక్షులు అంగోత్ మంగీలాల్ మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా అన్ని విభాగాల సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు, ఉద్యానవన కాంట్రాక్ట్ కార్మికులకు, ఈఎస్ఐ వైద్య సౌకర్యం అమలు కొరకు మణుగూరులో కూడా సంబంధిత కార్యాచరణ రూపొందించారనీ కానీ ఇప్పటివరకు పథకం అమలు కాలేదన్నారు దీంతో కాంటాక్ట్ కార్మికులు మరియు వారి కుటుంబ సభ్యులు వైద్య సౌకర్యం కొరకు ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యం కొరకు స్తోమతను మించి ప్రైవేటు వైద్యశాలలో ఖర్చు పెట్టాల్సి వస్తుందని ఆయన వాపోయారు దయచేసి వీలైనంత త్వరగా మణుగూరు ఏరియా అన్ని విభాగాల కాంటాక్ట్ కార్మికులకు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ఈఎస్ఐ వైద్య సౌకర్యం అమలయ్యేలా చూడాలని కోరారు ఈ సంవత్సరం మార్చి నెలాఖరు వరకు పిఎఫ్ లెక్కల పాస్ జమ వివరాలతో కూడిన బుక్కులు సత్వరమే అందజేయాలనీ ఈ కార్యక్రమం లో బెల్ట్ క్లీనింగ్, షెల్ పికింగ్,మరియు సివిక్ కాంట్రాక్ట్ కార్మికులు సంజీవ్, వెంకటేశ్వర్లు, పి వీరభద్రం, లక్ష్మీనారాయణ, నగేష్, సాంబయ్య, లింగయ్య, ఆనంద్, లక్ష్మణ్, అరుణ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మసీదుల అభివృద్ధికి నిధులు కోరిన ముస్లిం సోదరులు



మైనార్టీ శాఖ ద్వారా నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ

**నరసింహ ఏన్కూరు పెన్ సత్తా, ఫిబ్రవరి 26:**పవిత్ర రంజాన్ మాసం సమీపిస్తున్న నేపథ్యంలో ఏన్కూరు మండలంలోని మసీదులలో తాత్కాలిక మరమ్మతుల అవసరం అత్యవసరంగా ఉన్నదని తెలియజేస్తూ మండల ముస్లిం కమిటీ సభ్యులు గురువారం కొత్తగూడెంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ స్వగృహంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. రంజాన్ సందర్భంగా ప్రార్థనలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యే అవకాశమున్నందున మసీదులలో ప్రాథమిక సౌకర్యాలను మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని ప్రతినిధి బృందం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లింది.

మండల పరిధిలోని మొత్తం 9 మసీదులలో మూత్రశాలలు, మరుగుదొడ్లు మరమ్మత్తులు చేపట్టడం తో పాటు ప్రార్థనా మందిరాల పరిసరాలను శుభ్రపరచడం, గోడలకు రంగులు వేయడం వంటి పనుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రతి మసీదుకు కనీసం రూ.50,000 చొప్పున ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ స్పందిస్తూ మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా అవసరమైన నిధులను మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. రంజాన్ మాసంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సదుపాయాలన్నీ కల్పించేందుకు తమ వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఏఎంసీ చైర్మన్ లచ్చి రామ్ నాయక్‌తో పాటు మండల ముస్లిం కమిటీ సభ్యులు నన్నే ఖాన్, గౌర్ ఖాన్, పటాన్ మజీద్ ఖాన్, షకీల్, శంషుద్దీన్, వహాబ్, సొందు, మైబల్లి, పాషా, అఫ్జల్, మౌలాలి, సైదా, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మాసాన్ని దృష్టిలో ఉంచుకొని మసీదుల మరమ్మతులకు ప్రభుత్వం నుంచి తక్షణ సహాయం అందించాలని ముస్లిం సోదరులు ఈ సందర్భంగా కోరారు.

## ఏన్కూర్‌లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



**నరసింహ ఏన్కూరు పెన్ సత్తా, ఫిబ్రవరి 26:** వైరా డివిజన్ డీఈ రమేష్ ఆదేశానుసారం, విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ఏడి యాసిన్ ఆధ్వర్యంలో ఏన్కూర్ ప్రాంత విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం నూతనంగా పెద్ద సామర్థ్యంతో కూడిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. గతంలో ఈ ప్రాంతంలో కేవలం 5 ఎంబీ సామర్థ్యం గల చిన్న ట్రాన్స్‌ఫార్మర్ మాత్రమే అందుబాటులో ఉండడంతో, పెరుగుతున్న విద్యుత్ వినియోగం దృష్ట్యా తరచూ లో వోల్టేజ్ సమస్యలు, పవర్ ట్రిప్పింగ్ వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా గృహ వినియోగదారులు, వ్యవసాయ రైతులు మరియు చిన్న వ్యాపారస్తులు విద్యుత్ అంతరాయం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది.

ఈ సమస్యలను గుర్తించిన విద్యుత్ శాఖ అధికారులు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం 8 ఎంబీ సామర్థ్యం గల నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ద్వారా విద్యుత్ లోడ్‌ను సమర్థవంతంగా పంపిణీ చేయడమే కాకుండా, పరిసర గ్రామాలైన గృహాలు, వ్యవసాయ పంపుసెట్లు మరియు చిన్న పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా అందే విధంగా చర్యలు తీసుకున్నారు.

ఇప్పటివరకు ఎదురవుతున్న లో వోల్టేజ్ సమస్యలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అదేవిధంగా, వేసవి కాలంలో విద్యుత్ వినియోగం పెరిగే సమయంలో కూడా విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా ఉండేందుకు ఈ చర్యలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఏ ఏడి ఇందిరా, టీఆర్ఏ ఏఈ సిద్ధ రాఘవయ్య, ఏఈ ఉమాకాంత్, ఎల్ఐ రమేష్, ఏఎల్ఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సదుపాయాల మెరుగుదలకు విద్యుత్ శాఖ తీసుకుంటున్న చర్యలు ప్రజలకు విశేషంగా ఉపయోగపడనున్నాయని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

## పెండింగ్ వేతనాలు ఇప్పించండి. డిప్యూటీ కమిషనర్ కు గ్రామ పంచాయతీ వర్కర్స్ వినతి :-



**చింతకాని పెన్ సత్తా, ఫిబ్రవరి 26: ప్రతినిధి.**చింతకాని:-పెండింగ్ లో ఉన్న 8 గ్రామ పంచాయతీల సిబ్బంది వేతనాలను ఇప్పించాలని కోరుతూ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ విద్యాలత కు గురువారం నాడు మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.... ఇందుకు స్పందిస్తూ వీలయినంత త్వరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనివ్వడం జరిగింది...

ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ తో పాటు జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి చుంచు శ్రీనివాసరావు, మండల పరిషత్ అధికారి మొహమ్మద్ పర్వీన్ కైసర్, నాగులవంచ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ అంబటి శరత్,వార్డ్ మెంబర్లు వీరదాసు,చెట్టిపోగు నరేష్,బైరు రేణుక,గంధం ఇందిర,అనగాని జానకి, అన్నేపోగు రవి,మాఘం వెంకటేశ్వర్లు,గురిజాల జయకుమార్,గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి బి ఫణిరాజు,మండల నాయకులు దేశబోయిన కొండలు,కంభం పద్మ,తురక వెంకటేశ్వర్లు,షేక్ బాషా సాహెబ్, జగ్గయ్య,ఓర్సు పుష్ప, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు..

## చింతకాని చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవముల కళ్యాణ కరపత్రాని చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ కు అందచేసిన ఆలయ నిర్వహణ అధికారి.

**చింతకాని పెన్ సత్తా, ఫిబ్రవరి 26:ప్రతినిధి.**చింతకానిలో మర్చి 2 వ తారీఖున పాల్గుణ శుద్ధ చతుర్దశి పౌర్ణమి రోజున జరగబోయే శ్రీ భూనీల సమేత శ్రీ చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవముల సందర్భంగా కళ్యాణ కరపత్రాన్ని చింతకాని సర్పంచ్ కు అందజేయడం జరిగింది.

ఈ యొక్క కార్యక్రమంలో ఆలయ నిర్వహణాధికారి సిహెచ్ రామకోటి శ్వరరావు, ఆలయ అర్చకులు ఫణిహారం శ్రీనివాసాచార్యులు, గోపి కృష్ణమాచార్యులు జూనియర్ అసిస్టెంట్ నాగరాజు పాల్గొనడం జరిగింది.



## ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం-రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం.. ఎస్సై వీరేందర్



**చింతకాని పెన్ సత్తా, ఫిబ్రవరి 26:ప్రతినిధి.**చింతకాని మండలం సీతంపేట గ్రామంలో గ్రామస్తులకు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం ఎస్సై వీరేందర్ నిర్వహించారు... ఈ సందర్భంగా ఎస్సై వీరేందర్ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ ను పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోరారు.డ్రైవింగ్ చేసేటప్పుడు హెల్మెంట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, బైక్ పై త్రిబుల్ రైడింగ్ చేయకూడదని సూచించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని స్పీడ్ గా డ్రైవింగ్ చేయడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని దీనివల్ల ప్రమాదాలు కారణమై మరణించడం జరుగుతుందని దీనివలన కుటుంబం దూరం కావలసి వస్తుందని అన్నారు.. అతివేగం ప్రమాదకరమని, ప్రాణం ఎంతో విలువైందని వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని వాహనాలు నడపాలని సూచించారు..

కాబట్టి వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించి డ్రైవింగ్ చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గజేందర్ , కిషోర్,దుర్గ ,నాగార్జున్ పాల్గొన్నారు..

## ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి



**చేగుంట: పెన్ సత్తా, ఫిబ్రవరి 26:** చేగుంట / మాసాయిపేట మండలం బొమ్మారం గ్రామానికి చెందిన మెట్టెల నాగరాజు, తండ్రి నర్సింలు, వృత్తి ట్రాక్టర్ డ్రైవర్ నిన్న అనగా బుధవారం తన యొక్క ట్రాక్టర్ పై రైల్వే ట్రాక్ పనులకు వాటర్ సప్లై చేస్తుండగా ప్రమాదవశాత్తు టాక్టరు ట్యాంకర్ బోల్తాపడగా తలకి బలమైన గాయాలు అవ్వగా హుటా హుటిన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మరణించినాడు ఇట్టి విషయంలో మృతుని తండ్రి మట్టెల నర్సింలు, వయసు 43 తండ్రి లింగయ్య వారి ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినది,

## టీసీఎస్ ఏఐకి భయపడదు




దేశీయ ఐటీ సేవల దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కృత్రిమ మేధస్సు (ఏఐ)కి భయపడదని కంపెనీ సీఈఓ కె కృతివాసన్ అన్నారు. కంపెనీ వార్షిక సమావేశంలో మాట్లాడిన ఆయన.. ఏఐ కారణంగా టీసీఎస్ ప్రస్తుత ఆదాయంలో కొంత తగ్గినప్పటికీ ఏఐ టూల్స్ ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఏఐ కారణంగా జరిగే మార్పుల కోసం సిద్ధంగా ఉన్నామని, కంపెనీ విధానాల్లోనూ మార్పు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టులలో ఏఐని ఉపయోగించమని ఉద్యోగులకు చెబుతున్నాం, దీనివల్ల కంపెనీకి స్వల్పకాలంలో ఆదాయం తగ్గినా సరే ప్రోత్సాహం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కంపెనీలో మొత్తం 6 లక్షలకు పైగా ఉద్యోగులు ఉన్నారు. వారంతా ఏఐ స్కిల్స్ కలిగి ఉండాలని ఆశిస్తున్నాం. యువ ఉద్యోగులతో పోలిస్తే, సీనియర్లు ఏఐని అలవర్చుకోవడం వెనుకబడ్డారని గుర్తించాం. కొత్త టెక్నాలజీ విషయంలో ఉద్యోగాలు పోతాయనే చర్చకు భయపడట్లేదు, దీన్ని అధిగమించేందుకు ఉద్యోగులు కూడా కొంత కష్ట పడాలని కోరుకుంటున్నామని వివరించారు. ఏఐని ఉపయోగించడం అంటే ఓపెన్ఏఈకి చెందిన చాట్‌జీపీటీ లాంటి ప్లాట్‌ఫామ్‌లకు సాధారణ ప్రాంప్ట్‌లను ఇవ్వడం మాత్రమే కాదు, దాంతో ఉపయోగపడే పరిష్కారాలను సాధించడం కూడా అని ఆయన పేర్కొన్నారు.

## తగ్గిన బంగారం ధరలు



ఇటీవల కాలంలో బంగారం ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒకరోజు రేట్లు తగ్గి కాస్త ఊరటనిస్తుంటే మరో రోజు పెరిగి అమ్మో అనిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం ఈ ఫిబ్రవరి నెల నుంచి పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో గోల్డ్ ప్రియులు ధరలు తగ్గుతాయేమో అని ఎదురుచూశారు. కానీ వారికి నిరాశే మిగిలింది. ఇవాళ(ఫిబ్రవరి 26) హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరల్లో స్వల్ప తగ్గుదల కనిపిస్తుంది. 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర పై రూ.210 తగ్గి రూ.1,61,680గా ఉంది. ఇక ఆభరణాల తయారీలో వినియోగించే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర పై రూ.200 పతనమై రూ.1,48,200కు చేరింది. ఇక వెండి (రాతిశ్రీలవతీ) ధరలు నిన్నటి ధరలతో పోల్చితే స్థిరంగా ఉన్నాయి. కిలో వెండి ధర నేడు(గురువారం) రూ.2,95,000 వద్ద కొనసాగుతోంది.

## మనీలాండరింగ్ కేసులో అనిల్ అంబానీ రూ. 3,716 కోట్ల ముంబై ఇల్లు అటాచ్



రిలయన్స్ గ్రూప్ అధినేత అనిల్ అంబానీకి సంబంధించి మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఆయన నివాసం 'అబోడ్'ను ఈడీ అధికారులు అటాచ్ చేశారు. ముంబైలోని పాల్‌హిల్ ప్రాంతంలో ఉన్న రూ.3,716.83 కోట్ల విలువైన 17 అంతస్తుల నివాసం 'అబోడ్'ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) జప్తు చేసినట్టు అధికారులు వెల్లడించారు. దీంతో ఈ కేసులో అటాచ్ చేసిన ఆస్తుల మొత్తం విలువ దాదాపు రూ.15,700 కోట్లకు పెరిగింది. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్ కంపెనీలు రూ. 40 వేల కోట్లకుపైన బ్యాంకు రుణాల మోసానికి పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా జరిగిన జప్తు రిలయన్స్ కమ్యూనికేషన్స్(ఆర్‌కామ్)తో సంబంధం ఉన్న కేసులో భాగంగా జరిగింది. కాగా, నేడు(ఫిబ్రవరి 26) అనిల్ అంబానీ మరోసారి ఢిల్లీలో ఈడీ విచారణకు హాజరు కానున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఆయనకు ఈడీ సమన్లు జారీ చేసింది. మనీలాండరింగ్ కేసు కింద అనిల్ అంబానీ స్టేట్‌మెంట్ నమోదు చేసేందుకు 2025, ఆగస్టులో ఆయన మొదటిసారిగా ఈడీ ముందు విచారణకు హాజరయ్యారు.

## ఏపీలో రూ.1200 కోట్లతో క్లీన్ మాక్స్ సోలార్ పార్క్



ఏపీలో రూ.1200 కోట్లతో 200 మెగావాట్ల సోలార్ పార్క్ అభివృద్ధి చేయడానికి క్లీన్ మాక్స్ ఎనర్జీ సంస్థ ముందుకు వచ్చింది. అయితే ఈ ప్రాజెక్ట్ ఖచ్చితమైన స్థలం ఇంకా ప్రకటించకపోయినా, సొంత నిర్మాణం, నిర్వహణ పద్ధతిలో(బూ) ఈ పార్క్ ను అభివృద్ధి చేయనున్నట్టు సమాచారం. కాగా ప్రాజెక్ట్ పూర్తయ్యాక ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ప్రధానంగా కమర్షియల్ మరియు ఇండస్ట్రియల్(అడఎ) వినియోగదారులకు దీర్ఘకాలిక పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ల ద్వారా సరఫరా చేయనున్నారు. ప్రస్తుతం క్లీన్ మాక్స్ దాదాపు 1.5 గిగావాట్ల ఆపరేషనల్ రిన్యూవబుల్ ఎనర్జీ సామర్థ్యాన్ని(సోలార్ + విండ్) కలిగి ఉండగా.. 2027 నాటికి 3 గిగావాట్లకు చేరుకోవడమే సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఇక ఈ కొత్త ప్రాజెక్ట్ 18 నుండి 24 నెలల్లో దశలవారీగా పూర్తి చేయనున్నారు. భారతదేశంలో రూఫ్‌టాప్, గ్రౌండ్-మౌంట్ సోలార్ రంగంలో టాప్ ఉన్న క్లీన్ మాక్స్.. గూగుల్, అమెజాన, మైక్రోసాఫ్ట్, వాల్ మార్ట్ వంటి గ్లోబల్ దిగ్గజాలకు గ్రీన్ పవర్ సరఫరా చేస్తోంది. కాగా త్వరలోనే ఈ సంస్థ ఐపీఓ కి వెళ్లనుంది. ఏపీలో పెట్టుబడి పెట్టనున్న రూ.1,200 కోట్ల భారీ పెట్టుబడి భారత భవిష్యత్తు సోలార్ రంగంపై సంస్థకు ఉన్న గట్టి నమ్మకాన్ని తెలియజేస్తోంది. ఐపీఓకువెళ్లక ముందే సంస్థ విస్తరణను చేపట్టడం ద్వారా పెట్టుబడిదారుల ముందు బలమైన గ్రోత్ స్టోరీని ప్రదర్శించాలనే వ్యూహంతో క్లీన్ మాక్స్ ముందుకు సాగుతోంది. మొత్తంగా చూసినట్లయితే.. క్లీన్ మాక్స్ సోలార్ ప్రాజెక్ట్ సంస్థ పబ్లిక్ ఇష్యూ ప్రక్రియకు ఒక ముఖ్యమైన బూస్ట్‌గా నిలిచే అవకాశముంది.

# ఐడీఎఫ్‌సీ బ్యాంక్ ఫ్రాడ్ వ్యవహారంలో మాజీ మేనేజరే కీలక సూత్రధారి




ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో జరిగిన రూ. 590 కోట్ల భారీ మోసంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. బ్యాంకు చండీగఢ్ బ్రాంచ్‌లో జరిగిన ఈ ఫ్రాడ్ వెనుక మాజీ బ్రాంచ్ మేనేజర్ హస్తం ఉందని, హర్యానా ప్రభుత్వ విభాగాల ఖాతాల నుంచి నిధులు మాజీ మేనేజర్ భార్య, బావమరిది నడుపుతున్న కంపెనీకి చెందిన ఖాతాలోకి మళ్లించారనేగ్భ్రాంతికరమైన వివరాలు దర్యాప్తులో తేలాయి. హర్యానా అవినీతి నిరోధక విభాగం ఈ కేసులో ఇప్పటివరకు మాజీ బ్రాంచ్ మేనేజర్ రిభవ్ రిషి, బ్యాంకు మాజీ రిలేషన్‌షిప్ మేనేజర్ అభయ్, రిభవ్ భార్య స్వాతి సింగ్లా, ఆమె సోదరుడు అభిషేక్ సింగ్లాలను అరెస్టు చేసింది. ఈ మొత్తం వ్యవహారంలో బ్యాంకు మాజీ మేనేజరే సూత్రధారి అని అధికారులు గుర్తించారు. బ్యాంకు కార్యకలాపాల్లో అవకతవకలు సృష్టించి ప్రభుత్వ నిధులను అతడు షెల్ కంపెనీలకు మళ్లించినట్టు స్పష్టమైంది. అవినీతి నిరోధక విభాగం డైరెక్టర్ జనరల్ ఎఎస్ చావ్లా మాట్లాడుతూ.. రిభవ్, అభయ్ ఈ కేసులో ప్రధాన నిందితులు. వారిద్దరూ ఆరు నెలల క్రితమే ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు నుంచి తమ ఉద్యోగాలను వీడారని చెప్పారు. రిభవ్ రిషి ప్రస్తుతం ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో పనిచేస్తున్నట్టు పేర్కొన్నారు. 2025, సెప్టెంబర్‌లో హర్యానా ముఖ్యమంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన పథకానికి సంబంధించిన నిధుల జమ కోసం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకుతో పాటు ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో ఆ రాష్ట్ర అధికారులు రెండు అకౌంట్లు తెరిచారు. మొదట్లో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులు రూ. 50 కోట్లను, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో రూ. 25 కోట్లు డిపాజిట్ చేశారు. ఆ తర్వాతే బ్రాంచ్ మేనేజర్‌గా ఉన్న రిభవ్ రిషి, రిలేషన్‌షిప్ మేనేజర్ అభయ్, హర్యానా ప్రభుత్వ శాఖ ఖాతాలను దుర్వినియోగం చేశారు. అనధికార లావాదేవీలు నిర్వహించి, సరైన అనుమతి లేకుండా రికార్డులను తారుమారు చేశారు. పెద్ద మొత్తంలో అంటే దాదాపు రూ. 300 కోట్లు ప్రభుత్వానికి చెందినన ఖాతాల నుంచి వీరు స్వస్తిక్ దేశ్ ప్రాజెక్ట్స్ అనే ప్రైవేట్ కంపెనీకి బదిలీ చేశారు. ఈ కంపెనీ రిభవ్ భార్య, ఆమె సోదరుడికి చెందినదని సమాచారం. అక్కడి నుంచి, డబ్బును ఇతర షెల్ కంపెనీలకు తరలించారు. దీనివల్లే ఈ ఫ్రాడ్‌ను వెంటనే గుర్తించడం కష్టమైంది. అయితే, ప్రభుత్వ పథకానికి సంబంధించిన నిధుల వినియోగంపై హర్యానా రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి ఉత్తర్వులు రాకపోవడంతో ఈ బ్యాంకుల్లోని అకౌంట్లను క్లోజ్ చేయాలని అధికారులు నిర్ణయించారు. దీంతో ఖాతాల్లోని సొమ్మును వడ్డీతో కలిపి బదిలీ చేయాలని బ్యాంకులకు లేఖలు పంపారు. ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు అకౌంట్లోని సొమ్మును హర్యానా ప్రభుత్వానికి బదిలీ చేసి, ఆ అకౌంట్‌ను క్లోజ్ చేశారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ మాత్రం ప్రక్రియను ఆలస్యం చేసింది. దీనిపై బ్యాంకు నుంచి సరైన స్పందన లేకపోవడం విచారణ కమిటీ వేయగా, వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నిందితులు సొమ్మునంతా షెల్ కంపెనీలకు ట్రాన్స్‌ఫర్ చేశారని తేలింది. బ్యాంకులో జరిగిన నిర్వహణా లోపాలతో అనుమానం ఉన్న లావాదేవీలను పరిశీలించడంతో, ప్రభుత్వ అకౌంట్లలోని మొత్తం రూ. 590 కోట్ల వరకు నిధులను దారి మళ్లించారనే విషయం బయటపడింది.

# మారని ట్రంప్ తీరు.. సోలార్ ప్యానెల్స్‌పై 126 శాతం టారిఫ్



ఇటీవలే ఇండియా-యూఎస్ మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరింది. దీని గురించి ఇరుదేశాలు అధికారిక ప్రకటన కూడా చేశాయి. అయితే, భారత్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరు మాత్రం మారడంలేదు. తాజాగా మరోసారి భారీ టారిఫ్ విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. భారత్ నుంచి అమెరికాకు వెళ్లే సోలార్ ఉత్పత్తులపై ప్రాథమికంగా 126 శాతం దిగుమతి సుంకాల్ని విధిస్తున్నట్లు వెల్లడించారు. ఫారెన్ సబ్సిడీల ఆధారంగా ఈ స్థాయి రేటు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విషయంలో భారత్ సోలార్ తయారీ రంగంలో అన్యాయమైన పద్ధతిలో సబ్సిడీలు ఇస్తోందని, దీనివల్ల అమెరికా స్థానిక తయారీదారులు నష్టపోతున్నారని అమెరికా వాణిజ్య విభాగం చెబుతోంది. సులభంగా చెప్పాలంటే, భారత్ నుంచి వెళ్లే సోలార్ ప్యానెల్స్ ధరలు, అమెరికాలో కంటే తక్కువగా ఉన్నాయని అర్థం. అందుకే అమెరికా భారత సోలార్ ప్యానెల్స్‌పై భారీ టారిఫ్ విధించింది. మనదేశంతో పాటు మరో రెండు దేశాలపైనా ట్రంప్ టారిఫ్ విధించారు. ఇండోనేసియా సోలార్ ఉత్పత్తులపై 143 శాతం, లావోస్‌పై 81 శాతానికి దిగుమతి సుంకాల్ని పెంచుతున్నట్లు పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటనతో అమెరికాకు సోలార్ ఉత్పత్తుల్ని ఎగుమతి చేసే మన కంపెనీలపై తీవ్ర ప్రభావం పడింది. దీనివల్ల బుధవారం స్టాక్ మార్కెట్లలో సోలార్ స్టాక్స్ భారీగా నష్టపోయాయి. ముఖ్యంగా వారీ ఎనర్జీస్ 11 శాతం, ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్, విక్రమ్ సోలార్ లిమిటెడ్ ఒక్కోటి 6 శాతం, సోలెక్స్ ఎనర్జీ లిమిటెడ్ 8 శాతం, వెబ్‌సోల్ ఎనర్జీ సిస్టమ్ లిమిటెడ్ 7 శాతం మేర క్షీణించాయి.

# రూ.2.7 లక్షల కోట్ల స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు

గతేడాది మనదేశం నుంచి 30 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.2.7 లక్షల కోట్ల) విలువైన స్మార్ట్‌ఫోన్లు ఎగుమతి అయ్యాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం పేర్కొన్నారు. 'ప్రపంచానికి స్మార్ట్‌ఫోన్ తయారీ కేంద్రంగా భారత్ ఎదుగుతోంది' అని సామాజిక మాధ్యమాల్లో ఆయన పోస్ట్ చేశారు. గతేడాది మనదేశం నుంచి అత్యధికంగా ఎగుమతి అయ్యింది కూడా స్మార్ట్‌ఫోన్లేనని తెలిపారు. 2025లో మన దేశంలో రూ.5.5 లక్షల కోట్ల (60 బి.డాలర్ల) విలువైన మొబైల్ ఫోన్లు ఉత్పత్తి అయ్యాయి. 2024-25లో ఈ విభాగ ఎగుమతులు దాదాపు రూ.2 లక్షల కోట్లు (22 బి.డాలర్లు)గా ఉన్నాయి. గత ఏడాదిలో దేశం నుంచి మొత్తం ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.4 లక్షల కోట్లు (44 బి.డాలర్లు) మించాయి. ఈ ఏడాది 4 సెమీకండక్టర్ ప్లాంట్లలో ఉత్పత్తి ప్రారంభమైతే, ఇవి మరింత పెరిగే అవకాశం ఉంది. చైనా-అమెరికా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాక.. అమెరికా దిగ్గజ సంస్థ యాపిల్, భారత్‌లో తయారీని విస్తరించిందని, ఫలితంగా మన దేశ స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు రికార్డు స్థాయికి చేరాయని కౌంటర్‌పాయింట్ సహవ్యవస్థాపకుడు, ఉపాధ్యక్షుడు నీల్ షా పేర్కొన్నారు. 2025లో మన దేశంలో తయారైన ప్రతి నాలుగు స్మార్ట్‌ఫోన్లలో ఒకటి ఎగుమతి అయిందని అన్నారు.

# షార్ట్ వీడియోలు ఎక్కువగా చూస్తున్నారా? మీ మెదడుపై ఎలాంటి ప్రభావం పడుతుందో తెలుసా..



మనం ఖాళీ సమయం దొరికితే చాలు ఫోన్ తీసి ుఱఎఱశీఎ, ×అర్ఘుస్త్రతీఘఎ =వవశ్రీం లేదా ˆశీబుబఎవ ూష్ట్రశీతీం చూస్తూ గంటలు గంటలు గడిపేస్తుంటాం. అయితే, ఇలాంటి షార్ట్ వీడియోలు ఎక్కువగా చూడటం వల్ల మన మెదడుపై ఎలాంటి ప్రభావం పడుతుందో చైనా పరిశోధకులు ఒక కొత్త అధ్యయనంలో వెల్లడించారు.

**మెదడుపై పరిశోధన:**

పరిశోధకులు కొంతమంది యువకుల మెదడు తరంగాలను పరిశీలించి కొన్ని విషయాలను గుర్తించారు. షార్ట్ వీడియోలు చూడటం అలవాటు పడిన వారి మెదడులో దృష్టిని కేంద్రీకరించే భాగాలు నెమ్మదిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. ఏదైనా పని మీద దృష్టి పెట్టి చేయాలన్నా లేదా దృష్టిని మళ్ళీ పని మీదకు మళ్ళించాలన్నా మెదడు చాలా ఇబ్బంది పడుతోంది. వీడియోలు చూస్తూ ఆపలేకపోవడం వల్ల మెదడులో సెల్ఫ్ కంట్రోల్ శక్తి తగ్గుతోంది. పరిశోధన ప్రకారం ఇవన్నీ పూర్తిగా ప్రమాదం అని చెప్పలేం. కానీ షార్ట్ వీడియోలు చూడటం వల్లే ఫోకస్ తగ్గిందా ? లేక ఫోకస్ తక్కువగా ఉన్నవారే ఇలాంటి వీడియోలకు ఆకర్షితులవుతున్నారా ? అనేది ఇంకా పూర్తిస్థాయిలో తేలాల్సి ఉంది. అయితే, గంటల తరబడి ఎం ఆలోచించకుండా వీడియోలు స్క్రోల్ చేయడం వల్ల మెదడు త్వరగా అలసిపోతుంది.

**ఫోకస్ పెరగాలంటే ఏం చేయాలి?:**

మనం సోషల్ మీడియాను పూర్తిగా మానేయక్కర్లేదు, కానీ కొన్ని మార్పులు చేసుకుంటే మంచిది. రోజుకు ఎంతసేపు వీడియోలు చూడాలి అనేదానికి ఒక టైం పెట్టుకోండి. భోజనం చేసేటప్పుడు లేదా నిద్రపోయే ముందు కనీసం ఒక గంట పాటు ఫోన్ దూరంగా పెట్టేయండి. ఏదైనా ముఖ్యమైన పని లేదా చదువు మొదలుపెట్టే ముందు షార్ట్ వీడియోలను చూడకండి. అలా చూస్తే పని మీద మనసు పెట్టడం కష్టమవుతుంది. కేవలం టైమ్ పాస్ కోసం కాకుండా, మీకు ఉపయోగపడే విషయాల కోసం మాత్రమే సోషల్ మీడియాను వాడటానికి ప్రయత్నించండి.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## ఉద్యోగాన్ని త్యజించి ధర్మప్రచారానికి అంకితమైన జీవితం

జగిత్యాల జిల్లాకు ఆధ్యాత్మిక కాంతి పుంజంగా నిలిచిన మందపల్లి పరాంకుశాచార్య స్వామి (పాపాచార్యులు) శతాధిక వయస్సులో పరమపదించిన వార్త భక్తజన సమాజాన్ని విషాదంలో ముంచెత్తింది. వంద మూడేళ్ల దీర్ఘాయుష్షును అనుభవించి, చివరి శ్వాస వరకు సాంప్రదాయ ధర్మ ప్రచారాన్ని జీవిత ధ్యేయంగా నిలబెట్టుకున్న ఈ మహనీయుని జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయక గాథగా నిలిచి పోతుంది. లక్షెట్టిపేట వాస్తవ్యులైన ఆయన దాదాపు ఎనభై అయిదేళ్లకు పైగా గ్రామంలోని జగన్నాథాచార్యుల ఆలయంలో వంశపారంపర్య అర్చకుడిగా సేవలందించి, ఆలయ పరంపరను కాపాడిన కర్తవ్య నిరతుడిగా ఖ్యాతి గడించారు. వేయికి పైగా భాగవత సప్తాహాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించి, పౌరాణిక ధర్మ ప్రచారంలో విశిష్ట స్థానాన్ని సంపాదించారు.ప్రమోదూత నామ సంవత్సరంలో శ్రావణ శుద్ధ చతుర్దశి నాడు 1929లో జగిత్యాల జిల్లాలో జన్మించిన పరాంకుశాచార్యుల తల్లి రాధమ్మ, తండ్రి మందపల్లి రామాచార్యులు. తండ్రి రెవిన్యూ శాఖలో ఉద్యోగిగా ఉన్నప్పటికీ సంప్రదాయ నిష్ఠను కాపాడిన వారు. తాతగారు మందపల్లి పాపయ్య తహసీల్దారు హోదాలో ఉన్నప్పటికీ ధర్మాచరణలో ఆదర్శంగా నిలిచారు. మాతామహులు నంబి సీతారామాచార్యులు సాంప్రదాయ పాండిత్య సంపత్తితో ప్రసిద్ధి గాంచారు. ఈ విధంగా కుటుంబ వాతావరణమే పరాంకుశాచార్యుల వారిలో ధర్మనిష్ఠను, వేదాంతాసక్తిని పెంపొందించింది. బాల్యం లోనే అసాధారణ మేధస్సుతో అమర కోశాన్ని కంఠస్థం చేయడం ఆయన విద్యా ప్రస్థానానికి బలమైన పునాది. కోరుట్ల లోని సేనాపతి సంస్కృత పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగించి, తొలి శతావధాని శిరీశిహల్ కృష్ణమాచార్యుల వద్ద రామశబ్దం నుండి శ్రీభాష్యాంతం వరకు సంస్కృత సాహిత్యాన్ని, ఉభయ వేదాంత గ్రంథాలను అధీతి చేశారు. గురుపరంపరపై ఉన్న భక్తి, శాస్త్రాధ్యయనంలో ఉన్న శ్రద్ధ ఆయనను ప్రగాఢ పాండిత్యంతో తీర్చిదిద్దాయి. కేవలం పాఠ్యాంశ పరిధిలోనే కాకుండా పురాణ, ఇతిహాస, ఆళ్వారు ప్రబంధాలపై కూడా సమగ్ర పట్టు సాధించారు. చిన్ననాటి నుంచే హిందీ విద్యను అభ్యసించి 1945లో హిందీ విద్వాన్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. అయితే తండ్రి ఆజ్ఞానుసారం ఉద్యోగ జీవితం వైపు మళ్లక, సంప్రదాయ ధర్మ ప్రచారాన్ని జీవన వ్రతంగా స్వీకరించారు. ఈ నిర్ణయం ఆయన జీవితాన్ని సాధారణ గృహస్థుని స్థాయి నుండి ఆధ్యాత్మిక గురువుగా ఎదగడానికి మార్గం చూపింది. పంచ సంస్కార గురువుగా కోరుట్లకు చెందిన శ్రీ ఉ.వే.ప్ర. రాజయోగి సేనాపతి నృసింహాచార్యుల వారి సన్నిధిలో సంస్కార దీక్ష పొందడం ఆయన జీవితంలో కీలక ఘట్టం.మోర్తాడుకు చెందిన లక్ష్మమ్మతో పన్నెండేళ్ల వయసులోనే వివాహం జరిగినప్పటికీ గృహస్థాశ్రమ ధర్మాన్ని పాటిస్తూ, ఆధ్యాత్మిక సేవను సమన్వయ పరిచారు. కుటుంబంగా ఇద్దరు కుమారులు?శ్రీ రామమూర్తి, జగన్నాథాచార్యులు... ఇద్దరు కుమార్తెలు ఆండాళు, పద్మ. పెద్ద కుమారుడు రామమూర్తి ఆంధ్రాబ్యాంకులో ఉద్యోగం చేసి విరమణ పొందారు. వయోభారంతో చివరి కాలంలో హైదరాబాద్‌లో కుమారుడి వద్ద నివసించినప్పటికీ, ధర్మ చింతన, జప తపాలు, పఠన ప్రవచనాలు ఆయన దినచర్యలో అంతర్భాగంగా ఉండేవి. పరాంకుశాచార్యుల వారి ఖ్యాతికి మూలకారణం ఆయన నిర్వహించిన భాగవత సప్తాహాలే. రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో భాగవత సప్తాహాలు నిర్వహించి భక్తులను భగవద్భక్తి మార్గంలో నడిపించారు. శ్రీమద్రామాయణం, మహాభారతం వంటి మహా గ్రంథాలపై సుమారు ఇరవై సార్లు కాలక్షేపాలు నిర్వహించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. తిరుమంత్రార్థం, తిరుప్పావు, శ్రీవచనభూషణం వంటి విశిష్టాద్వైత సాంప్రదాయ గ్రంథాలపై ప్రవచనాలు చేసి ఉభయ వేదాంత పాండిత్యాన్ని ప్రతిభావంతంగా చాటారు. ఆయన శ్రావ్యకంఠం, సులభ వ్యాఖ్యాన శైలి, ఉదాహరణలతో కూడిన వివరణ ప్రజలను ఆకట్టుకునేవి.భక్తి నివేదనలో భాగంగా శ్రీశ్రీశ్రీ చినజీయర్ స్వామివారి మంగళా శాసనాలు అందుకోవడం ఆయన ఆధ్యాత్మిక సేవకు లభించిన విశిష్ట గౌరవం. రాష్ట్రీయ సంస్కృత సంస్థానం లోనూ ఆయనకు ఉభయ వేదాంత పండిత భృతి లభించడం ఆయన పాండిత్యానికి గుర్తింపు. సుమారు ముప్పై ఆరు సంవత్సరాలు ప్రతి వత్సరం ఆర్థిక సాయం అందుకోవడం ఆయన శాస్త్ర సేవకు ప్రభుత్వ స్థాయి మన్ననగా నిలిచింది. లక్షెట్టిపేటలో నలభై ఏళ్లకు పైగా నివసించి ఆ ప్రాంత ప్రజలకు ఆధ్యాత్మిక మార్గదర్శకుడిగా నిలిచారు. జగిత్యాల, కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో ఆయన పేరు భాగవత పండితునిగా మార్మోగేది. ధనుర్మాసంలో తిరుప్పావు కాలక్షేపాలు నిర్వహించడం, వేణుగోపాల స్వామి సన్నిధిలో దివ్యప్రబంధ పఠనం చేయడం ఆయన దినచర్యలో భాగం. తి.తి.దే. ఆధ్వర్యంలోని ఆళ్వారు ప్రబంధ ప్రాజెక్టులో పాల్గొని దివ్యప్రబంధాల ప్రచారం చేయడం ఆయన సేవాభావానికి నిదర్శనం. అనారోగ్యానికి లోనుకాకుండా దీర్ఘకాలం ఆరోగ్యవంతమైన జీవితం గడపడం ఆయన నియమ నిష్ఠలకు ప్రతిఫలం. వయోభారంతో స్వల్ప అస్వస్థత ఏర్పడటంతో ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేక పరమ పదించారు. స్వగ్రామంలోనే అంత్యక్రియలు జరగాలన్న ఆయన కోరిక మేరకు లక్షెట్టిపేట గోదావరి తీరాన సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. బంధువులు, శిష్యులు, ధర్మపురి పండితులు, స్థానిక బ్రాహ్మణులు, గ్రామస్తులు అంతిమయాత్రలో పాల్గొని కన్నీటి నివాళులు అర్పించారు. పరాంకుశాచార్యుల జీవితం ఒక వ్యక్తి సాధన

ఎంత దూరం తీసుకెళ్లగలదో చూపిన సజీవ సాక్ష్యం. ఉద్యోగావకాశాలను త్యజించి సంప్రదాయ ప్రచారాన్ని ఎంచుకోవడం, కుటుంబ బాధ్యతల మధ్య ధర్మసేవను సమన్వయ పరచడం, శాస్త్ర పాండిత్యాన్ని ప్రజలందరికీ అందుబాటులో ఉంచడం?ఇవి అన్నీ ఆయన వ్యక్తిత్వాన్ని విశిష్టంగా నిలబెట్టాయి. భాగవత సప్తాహాల ద్వారా భక్తుల్లో నైతిక విలువలను, భగవద్భక్తిని, సత్సంస్కారాలను నాటిన ఆచార్యులవారు కేవలం ప్రవచనకర్త మాత్రమే కాదు; జీవనోపాధ్యాయుడు. ఆయన కంఠస్థ జ్ఞానం, ప్రవచన నైపుణ్యం, గురుపరంపరపై భక్తి, శిష్యులపై ప్రేమ? కలసి ఒక సంపూర్ణ ఆచార్య స్వరూపాన్ని నిర్మించాయి. సమాజంలో మారుతున్న విలువల మధ్య సంప్రదాయాన్ని కాపాడే ధృఢచిత్తంతో జీవించిన ఆయన, ఆచార్య పరంపరలో అరుదైన రత్నంగా నిలిచారు. శతాధిక వయస్సు దాటినా ధర్మప్రచారం ఆపకుండా కొనసాగించడం ఆయన ఆత్మబలాన్ని తెలియ జేస్తుంది. నేటి తరానికి పరాంకుశాచార్యుల వారి జీవితం ఒక సందేశం సంస్కృత విద్య, వేదాంత పాండిత్యం, సంప్రదాయ నిష్ఠలు కేవలం గతకాలపు ఆస్తులు కావు;

అవి సమాజాన్ని సుస్థిరంగా నిలబెట్టే మూల స్తంభాలు. గ్రామీణ వాతావరణంలో జన్మించి రాష్ట్ర వ్యాప్తంగా కీర్తి గడించిన ఆయన సాధన స్ఫూర్తిదాయకం. శాస్త్రసేవ, భక్తిప్రచారం, గురుభక్తి, నియమనిష్ఠలు కలసి ఒక మహనీయుని నిర్మిస్తాయని ఆయన జీవితం స్పష్టం చేస్తుంది. మందపల్లి పరాంకుశాచార్యస్వామి వారి పరమపదం ఒక యుగాంతరంలా అనిపించినా, ఆయన బోధనలు, ప్రవచనాలు, శిష్యపరంపర రూపంలో ఆధ్యాత్మిక వారసత్వం కొనసాగుతూనే ఉంటుంది. లక్షెట్టిపేట గోదావరి తీరంలో ఆయనకు నిర్వహించిన అంత్యక్రియలు కేవలం ఒక మహనీయునికి వీడ్కోలు మాత్రమే కాదు; ఒక సంప్రదాయ యుగానికి గౌరవనివాళి. ఆయన జీవితం భక్తి, పాండిత్యం, సేవ అనే త్రివేణి సంగమంగా నిలిచి తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తుంది.

# రోజంతా గోరువెచ్చని నీరు తాగితే ఏమవుతుంది..?

మన శరీరంలో 70 శాతం నీరే ఉంటుంది. అయితే ఆధునిక జీవనశైలిలో మనం రకరకాల డ్రింక్స్‌కు అలవాటు పడి, ప్రకృతి ప్రసాదించిన స్వచ్ఛమైన నీటిని ఎలా తాగాలో మర్చిపోతున్నాం. ముఖ్యంగా ఉదయాన్నే నిద్రలేవగానే గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరానికి ప్రయోజనాలు ఉన్నాయా..?ఇది అందరికీ మంచిదేనా? నీరు శరీర దాహాన్ని తీర్చడమే కాకుండా రక్తంలో కలిసిపోయి ప్రతి కణానికి ఆక్సిజన్‌ను సరఫరా చేసే జీవనాధారం. మానవ శరీరం 70 శాతం నీటితోనే నిర్మితమై ఉంటుంది. అయితే ఏ రకమైన నీరు ఎప్పుడు తాగాలి అనే విషయంలో చాలామందికి స్పష్టత ఉండదు. మన పూర్వీకుల నుండి వస్తున్న ఉదయం గోరువెచ్చని నీరు తాగే అలవాటు కేవలం సంప్రదాయం మాత్రమే కాదు అదొక అద్భుతమైన ఆరోగ్య ప్రక్రియ అని ఆయుర్వేదం చెబుతోంది.ఆయుర్వేద శాస్త్రం ప్రకారం.. ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరంలోని జీర్ణ అగ్ని యాక్టివేట్ అవుతుంది. ఇది శరీరంలోని కఫ దోషాన్ని సమతుల్యం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది.జీర్ణక్రియ మెరుగు: తిన్న ఆహారం త్వరగా జీర్ణం కావడానికి, మలబద్ధకం సమస్యను వదిలించడానికి ఇది చక్కటి పరిష్కారం.టాక్సిన్స్ తొలగింపు: శరీరం లోపల పేరుకుపోయిన హానికరమైన విష పదార్థాలను బయటకు పంపి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది.బరువు తగ్గడం: క్రమం తప్పకుండా వేడి నీటిని తాగడం వల్ల శరీరంలో మెటబాలిజం రేటు పెరిగి, కొవ్వు కరగడానికి సహాయపడుతుంది.శ్వాసకోశ సమస్యలకు చెక్: గొంతులో పేరుకుపోయిన కఫాన్ని వదులు చేసి, దగ్గు, జలుబు నుండి ఉపశమనాన్ని ఇస్తుంది.ఉదయం ఖాళీ కడుపుతో: బాడీని




రీఛార్జ్ చేయడానికి, జీర్ణక్రియను వేగవంతం చేయడానికి ఇది బెస్ట్ టైమ్.భోజనానికి 30 నిమిషాల ముందు: ఇది ఆకలిని నియంత్రించి, బరువు తగ్గాలనుకునే వారికి ఉపయోగపడుతుంది.భోజనం చేసిన గంట తర్వాత: తిన్న ఆహారం మెత్తగా మారి, పోషకాలు ఒంటికి పట్టడానికి ఇది సహాయపడుతుంది.గోరువెచ్చని నీరు ఆరోగ్యానికి మంచిదే అయినా, ఈ కింది సందర్భాల్లో తాగడం ప్రమాదకరమని ఆయుర్వేదం హెచ్చరిస్తోంది..తీవ్రమైన వేసవిలో: ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు వేడి నీరు తాగడం వల్ల శరీరంలో ఉష్ణోగ్రత పెరిగి అసౌకర్యం కలుగుతుంది.పిత్త సమస్యలు ఉన్నప్పుడు: కడుపులో మంట లేదా అసిడిటీతో బాధపడేవారు వేడి నీటికి దూరంగా ఉండాలి. అధిక దాహం: విపరీతమైన డీహైడ్రేషన్ ఉన్నప్పుడు గోరువెచ్చని నీరు తాగితే శరీరంలోని తేమ మరింత తగ్గే అవకాశం ఉంది.

# రోగాలను నయం చేసే శక్తి దీనికి ఉంది!



అతిబల మొక్క, భారతీయ సంప్రదాయ వైద్యంలో శతాబ్దాలుగా ఉపయోగించబడుతోంది. ఇది యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలతో జ్వరం, దగ్గు, కీళ్లనొప్పులు, కిడ్నీలో రాళ్లు, మూత్రనాళ వ్యాధులు, నడుము నొప్పి వంటి 100కు పైగా రోగాలను నయం చేయగలదని ఆయుర్వేదం చెబుతుంది. మన చుట్టూ ఉండే ఎన్నో మొక్కలు అలివికాని మొండి రోగాలను సైతం నయం చేయగలవని చాలామందికి తెలియదు. అలాంటి అద్భుత ఔషధ గుణాలు కలిగిన మొక్కల్లో అతిబల ఒకటి. దీనిని దువ్వెన బెండ, ముద్ర బెండ, తుత్తురు బెండ అని కూడా పిలుస్తారు. ఈ మొక్క మాల్వేసి కుటుంబానికి చెందినది. రోడ్ల పక్కన, పొలాల కంచెల వెంట విస్తారంగా కనిపించే ఈ మొక్కలో దాగి ఉన్న అద్భుత ఔషధ గుణాలు చాలామందికి తెలియదు. అతిబల మొక్క యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ ధర్మాలను కలిగి ఉంటుంది. భారతీయ సంప్రదాయ వైద్యంలో, ముఖ్యంగా తమిళ సిద్ధ వైద్యంలో, భారతీయ ఆయుర్వేదంలో దీనిలోని ప్రతి భాగాన్ని వివిధ వ్యాధుల చికిత్సకు ఉపయోగిస్తారు. ఈ మొక్క జ్వరం, దగ్గు, ఊపిరితిత్తుల వ్యాధులు, మూత్రనాళ వ్యాధులు, కిడ్నీలో రాళ్లు కరిగించడానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. కీళ్లనొప్పి లేదా కీళ్లవాతం ఉన్నప్పుడు అతిబల ఆకుల పేస్ట్‌కు ఆవాల నూనె కలిపి రాయడం వల్ల ఉపశమనం లభిస్తుంది. రక్త మొలలు ఉన్నవారు ఆకులను ఉడికించి తింటే తగ్గుతాయని చెబుతారు. ఆడవారిలో యోని ఇన్ఫెక్షన్లు ఉంటే, దీని ఆకుల డికాక్షన్‌తో శుభ్రం చేసుకోవచ్చు. చర్మంపై వాపులు, గాయాలు, పుండ్లు ఉన్నప్పుడు అతిబల ఆకులను పసుపుతో కలిపి పేస్ట్‌గా చేసి రాయడం వల్ల త్వరగా నయం అవుతాయి, ఎందుకంటే ఆకులకు యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి. మూత్రంలో మంట, మూత్రాశయంలో రాళ్లు ఉన్నవారు అతిబల ఆకులను నీటిలో మరిగించి తేనె కలిపి త్రాగడం వల్ల రాళ్లు కరిగి, మంట తగ్గుతుంది. అతిసారం ఉన్నవారికి దీని విత్తనాల పొడితో చేసిన టీ ఔషధంలా పనిచేస్తుంది. కంటిచూపు మెరుగుపరచడానికి అతిబల ఆకుల డికాక్షన్‌తో కళ్ళు కడుక్కుంటే మంచిది. ఊపిరితిత్తుల వ్యాధులు, క్షయ, శ్వాసనాళ వాపులకు దీని మొత్తం మొక్క భాగాన్ని (పూలు, కాండం, ఆకులు, కాయలు, వేర్లు) ఉపయోగించి కషాయం కాచి తాగడం వల్ల ఉపశమనం లభిస్తుంది. జ్వరం తగ్గడానికి అతిబల ఆకులను నానబెట్టి, ఆ నీటికి పటికబెల్లం కలిపి త్రాగుతారు. దంతాల ఆరోగ్యం కోసం దీని ఆకుల రసాన్ని నోటిలో ఉంచుకొని ఊసేయడం, డికాక్షన్‌తో పుక్కిలించడం వల్ల దంతాలు గట్టిపడి పంటినొప్పి తగ్గుతుంది. నడుము నొప్పి తగ్గడానికి అతిబల ఆకుల కషాయం త్రాగాలి. గౌట్, క్షయ, నోటిపూత, పేగుపూత, రక్తస్రావాలకు కూడా దీని డికాక్షన్ ఉపయోగిస్తారు. శరీరానికి బలం రావాలంటే, అతిబల మొక్క వేరును ఆవుపాలతో మరిగించి పటికబెల్లం కలిపి తీసుకోవాలని ఆయుర్వేద గ్రంథాలు సూచిస్తున్నాయి. మూత్రంలో రక్తం పడటం, మూత్రనాళంలో మంట తగ్గడానికి దీని ఆకుల రసాన్ని తేనెతో కలిపి తీసుకుంటారు. అతిబల ఆకుల రసాన్ని చక్కెరతో కలిపి త్రాగితే గుండె ఆరోగ్యానికి మంచిది. మగవారిలో శీఘ్రస్కలనం సమస్యకు, యూరినరీ ఇన్ఫెక్షన్లకు దీని వేరు కషాయం ఔషధంగా పనిచేస్తుంది. అతిబల మొక్క రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గించి షుగర్ వ్యాధిగ్రస్తులకు మేలు చేస్తుంది. ఈ మొక్క ఆకులు రోగనిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి.

# కళ్ల కింద డార్క్ సర్కిల్స్, వెనుక అసలు రహస్యం ఇదే!



చాలామంది కళ్ల కింద నల్లటి వలయాలు రాగానే ఖరీదైన క్రీములు వాడుతూ ఉంటారు. కనురెప్పలు అదురుతూ ఉంటే ఏదో కీడు జరుగుతుందని భయపడతారు. కానీ ఇవన్నీ మీ శరీరంలో ఒక ముఖ్యమైన పోషకాహారం తగ్గిందని చెప్పే హెచ్చరికలు కావొచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ముఖం పాలిపోవడం, దవడ కండరాలు బిగుసుకుపోవడం వంటి చిన్న చిన్న మార్పుల వెనుక పెద్ద ఆరోగ్య సమస్యే ఉండవచ్చు. సాధారణంగా అలసట, ఒత్తిడి లేదా ఎక్కువ కాఫీ తాగడం వల్ల కళ్లు అదురుతుంటాయి. కానీ ఇది తరచుగా జరుగుతుంటే మెగ్నీషియం లోపం కారణం కావచ్చు. మెగ్నీషియం నరాలు మరియు కండరాల మధ్య సంబంధాన్ని స్థిరంగా ఉంచుతుంది. ఇది తగ్గినప్పుడు కళ్ల చుట్టూ ఉండే చిన్న చిన్న కండరాలు స్పేమ్స్ కు గురవుతాయి.ఎంత నిద్రపోయినా కళ్ల కింద నలుపు తగ్గడం లేదంటే అది కేవలం కాస్మెటిక్ సమస్య కాదు. మెగ్నీషియం లోపం వల్ల నిద్ర సరిగ్గా పట్టదు, దీనివల్ల కళ్ల కింద చర్మం పల్చబడి రక్తనాళాలు బయటకు కనిపిస్తాయి. ఫలితంగా డార్క్ సర్కిల్స్ ఏర్పడతాయి. కేవలం క్రీములు రాస్తే ఇది తగ్గదు, ఆహారంలో మార్పులు చేసుకోవాల్సిందే.

ఉదయాన్నే నిద్రలేవగానే ముఖం, కళ్లు ఉబ్బినట్లు అనిపిస్తున్నాయా? అయితే శరీరంలో ఫ్లూయిడ్ బ్యాలెన్స్ తప్పిందని అర్థం. మెగ్నీషియం వాపును తగ్గిస్తుంది. ఇది లోపించినప్పుడు ముఖం ఉబ్బుగా, చర్మం పొడిగా మరియు నిర్జీవంగా కనిపిస్తుంది. అలాగే దవడ కండరాలు బిగుసుకుపోవడం, పెదవుల దగ్గర అదురు రావడం వంటివి కూడా దీని లక్షణాలే.డెర్మటాలజీ నిపుణులు చెబుతున్న ప్రకారం.. మెగ్నీషియం, నిద్ర, జీర్ణక్రియ కలిస్తేనే అందమైన చర్మం సాధ్యం. మెగ్నీషియం వల్ల గాఢ నిద్ర పడుతుంది, ఆ సమయంలోనే చర్మం తనను తాను బాగు చేసుకుని కొల్లాజెన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది లోపిస్తే చర్మం త్వరగా ముడతలు పడటం, మొటిమలు రావడం వంటి సమస్యలు తలెత్తుతాయి.

మెగ్నీషియం లోపాన్ని అధిగమించడానికి మన భారతీయ ఆహారంలో లభించే పాలకూర, గుమ్మడి గింజలు, బాదం, అరటిపండ్లు, తృణధాన్యాలు మరియు పప్పు దినుసులను డైట్‌లో చేర్చుకోవాలి. సమస్య తీవ్రంగా ఉంటే డాక్టర్ సలహాతో మెగ్నీషియం గ్లైసినేట్ వంటి సప్లిమెంట్లు వాడవచ్చు. మెగ్నీషియం లోపం అనేది నిశ్శబ్దంగా వచ్చే సమస్య. మీ ముఖం ఇచ్చే ఈ చిన్న చిన్న సంకేతాలను గమనించడం ద్వారా పెద్ద ఆరోగ్య సమస్యలను ముందే నివారించవచ్చు.

# నల్ల మిరియాలు.. ఔషధ గుణాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు!



నల్లగా ఉన్నాయి కదా అని తీసిపారేకయండి. వీటి ప్రయోజనాలు తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఇందులో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయంటున్నారు వైద్య నిపుణులు. వీటిని ప్రతి రోజు తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఈ రోజుల్లో బరువు తగ్గడం అనేది ప్రతి ఒక్కరికీ ఒక ప్రధాన కోరికగా మారింది. చాలా మంది గంటల తరబడి వ్యాయామం చేస్తారు. కఠినమైన ఆహారాలను పాటిస్తారు. కానీ ఇప్పటికీ ఆశించిన ఫలితాలు పొందలేకపోతున్నారు. అటువంటి పరిస్థితిలో మీ వంటగదిలో ఉండే నల్ల మిరియాలు వంటి చిన్న మసాలా దినుసును సరిగ్గా ఉపయోగించడం వల్ల బరువు తగ్గడానికి సహాయపడుతుందని మీకు తెలిస్తే ఆశ్చర్యపోతారు. నల్ల మిరియాలు ఆహారాన్ని కారంగా మార్చడమే కాకుండా, శరీర కొవ్వును కాల్చే సామర్థ్యాన్ని కూడా పెంచుతాయి. ఇందులో ఉండే పైపెరిన్ అనే సమ్మేళనం జీవక్రియను వేగవంతం చేస్తుంది. శరీరంలో నిల్వ ఉన్న కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఉబ్బరాన్ని నివారిస్తుంది. శరీరం థర్మోజెనిక్ కార్యకలాపాలను పెంచుతుంది. నిర్విషీకరణలో సహాయపడుతుంది. అందువల్ల ప్రతిరోజూ సరైన మొత్తంలో నల్ల మిరియాలను తీసుకోవడం వల్ల మీ బరువు తగ్గించే ప్రయాణం సులభం, వేగంగా ఉంటుంది. ఇది థర్మోజెనిక్ కార్యకలాపాలను పెంచుతుంది. ఇది కేలరీలను వేగంగా బర్న్ చేయడానికి సహాయపడుతుంది. ఇది యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది.

# టీ20 వరల్డ్ కప్: జింబాబ్వేపై భారత్ భారీ విజయం.. సెమీస్ ఆశలు సజీవం

### సెమీస్ రేసులో నిలిచేందుకు కీలక మ్యాచ్‌లో భారత్ ఘన విజయం
### తొలుత బ్యాటింగ్‌లో 256 పరుగుల భారీ స్కోరు చేసిన టీమిండియా
### ఛేదనలో 20 ఓవర్లలో 6 వికెట్లకు 184 పరుగులు చేసిన జింబాబ్వే
### ఒంటరి పోరాటం చేసిన జింబాబ్వే బ్యాటర్ బ్రయాన్ బెన్నెట్ (97*)
### బౌలింగ్‌లో రాణించిన అర్ష్‌దీప్ సింగ్.. మూడు వికెట్లు కైవసం




టీ20 ప్రపంచకప్‌లో సెమీస్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో టీమిండియా స్ఫూర్తిదాయక ప్రదర్శన చేసింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో జింబాబ్వేపై 72 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌లో పరుగుల వరద పారించిన భారత్, ఆ తర్వాత బౌలింగ్‌లోనూ రాణించి టోర్నీలో తమ సెమీఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకుంది.

భారత్ నిర్దేశించిన 257 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో జింబాబ్వే 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 184 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్ బ్రయాన్ బెన్నెట్ అద్భుత పోరాటపటిమ కనబరిచాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా, ఏమాత్రం బెదరకుండా భారత బౌలర్లను ఎదుర్కొన్నాడు. కేవలం 59 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 97 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. మరో ఓపెనర్ మరుమణి (20) నెమ్మదిగా ఆడగా, కెప్టెన్ సికందర్ రజా (31) కాసేపు బెన్నెట్‌కు సహకరించాడు.

బెన్నెట్, రజా క్రీజులో ఉన్నంతసేపు జింబాబ్వే స్కోరు బోర్డు ముందుకు కదిలింది. కానీ, అప్పటికే సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరిగిపోవడంతో వారిపై ఒత్తిడి పెరిగింది. రజా ఔటైన తర్వాత జింబాబ్వే ఓటమి ఖాయమైంది. బెన్నెట్ పోరాటం కేవలం ఓటమి అంతరాన్ని తగ్గించడానికి మాత్రమే ఉపయోగపడింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ అద్భుతంగా రాణించి 4 ఓవర్లలో కేవలం 24 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, శివమ్ దూబే చెరో వికెట్ తీశారు.అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 256 పరుగుల భారీ స్కోరు సాధించింది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (30 బంతుల్లో 55) అద్భుతమైన హాఫ్ సెంచరీతో శుభారంభం అందించాడు. సంజూ శాంసన్ (24), ఇషాన్ కిషన్ (38), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (33) కూడా వేగంగా ఆడారు. చివర్లో హార్దిక్ పాండ్యా (23 బంతుల్లో 50*), తిలక్ వర్మ (16 బంతుల్లో 44*) ఆకాశమే హద్దుగా చెలరేగారు. వీరిద్దరూ కేవలం 31 బంతుల్లోనే 84 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పి జట్టు స్కోరును 250 దాటించారు.ఈ విజయంతో భారత్ తన సెమీస్ అవకాశాలను మెరుగుపరుచుకుంది. సెమీఫైనల్‌కు అర్హత సాధించాలంటే తమ తదుపరి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై తప్పక గెలవాల్సి ఉంటుంది. ఈ మ్యాచ్ మార్చి 1న జరగనుంది. అటు, జింబాబ్వేపై టీమిండియా విజయంతో... దక్షిణాఫ్రికా జట్టుకు సెమీస్ బెర్తు ఖరారైంది.

## విండీస్‌తో మ్యాచ్‌కు ప్లాన్..
# ఈడెన్‌కి వెళ్లి వేస్తాం




టీ20 ప్రపంచ కప్ సూపర్-8 మ్యాచ్‌లో జింబాబ్వేపై టీమ్‌ఇండియా ఘన విజయంతో సెమీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. తన చివరి మ్యాచ్‌లో (మార్చి 1న) విండీస్‌పై గెలిస్తే సెమీఫైనల్‌కు చేరుకోవడం ఖాయం. ఈ క్రమంలో చెన్నై వేదికగా జింబాబ్వేపై విజయం సాధించిన అనంతరం కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడాడు. ఏదైనా సరే ఇక్కడితోనే వదిలేసి ముందుకు సాగుతామని.. లీగ్‌లో ఏం జరిగింది? అహ్మదాబాద్‌లో ఏమైందనే దానిపై ఎక్కువగా ఆలోచించమని స్పష్టం చేశాడు. విండీస్‌తో మ్యాచ్ నాటికి అన్నింటిని సరిచేసుకొని సిద్ధంగా ఉంటామని వెల్లడించాడు."ఈ మ్యాచ్‌కు ముందు మా వీడియో అనలిస్ట్ గతంలో మేం ఆడిన ఇన్నింగ్స్‌లకు సంబంధించి వీడియోలను చూపించాడు. బాగా ఆడిన వాటిని హైలైట్ చేసి మాలో స్ఫూర్తి నింపాడు. మేం పాజిటివ్‌గా ఈ మ్యాచ్ కోసం బరిలోకి దిగాం. ఓ స్పష్టతతో ఇక్కడికి వచ్చాం. టాప్ ఆర్డర్ నుంచి లోయర్ ఆర్డర్ వరకూ ప్రతి ఒక్కరూ కాంట్రిబ్యూషన్ చేయాలనుకున్నాం. ఈ మ్యాచ్‌లో ఏదైనా కాస్త మిస్ అయిందంటే అది బౌలింగ్‌లోనే. మేం ఇంకాస్త కట్టుదిట్టంగా బౌలింగ్ చేయాల్సింది. అయితే, విజయం ఎలా వచ్చినా విజయమే. ఈ సందర్భంగా జింబాబ్వే బ్యాటర్లకూ క్రెడిట్ ఇవ్వాలి. పవర్‌ప్లే లో వికెట్లను కోల్పోకుండా.. ఆ తర్వాత స్మార్ట్‌గా దూకుడును పెంచారు. బౌలింగ్ సైడ్ నుంచి మాత్రం మేం ఇంకాస్త మెరుగ్గా వేయాల్సింది. విండీస్‌తో (మార్చి 1న) మ్యాచ్ నాటికి అన్నింటిని సరిచేసుకొని రంగంలోకి దిగుతాం. కోల్‌కతాకు చేరుకున్నాక.. ఈడెన్ గార్డెన్స్‌లో కూర్చొని గేమ్ ప్లాన్ వేస్తాం. ఇవాళ, రేపు.. ప్రయాణం, విశ్రాంతి తీసుకుంటాం" అని సూర్య తెలిపాడు.

**గత మ్యాచ్‌తో పోలిస్తే మెరుగయ్యాం: రజా**

విండీస్‌తో మ్యాచ్‌తో పోలిస్తే ఈ సారి తమ బ్యాటర్ల ఆటతీరు చాలా మెరుగ్గా ఉందని జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా వ్యాఖ్యానించాడు. "ఈ మ్యాచ్‌లో మాకు చాలా సానుకూలాంశాలు ఉన్నాయి. తొలి ఆరు ఓవర్లలోనే మ్యాచ్‌ను గెలవలేమని మావాళ్లకు చెబుతుంటా. భారత్‌ను 210 లేదా 220 పరుగుల్లోపు నియంత్రించి ఉంటే.. మాకు ఏదైనా ఛాన్స్ ఉండేది. బ్యాటింగ్ కంటే బౌలింగ్, ఫీల్డింగ్‌లో మేం చాలా మెరుగు కావాల్సి ఉంది. జట్టులో చాలా మంది కుర్రాళ్లు తొలిసారి వరల్డ్ కప్ బరిలో నిలిచారు. భారత్ వేదికగా ఆడటం కూడా మొదటిసారే. అయితే, ఇదేమీ తప్పించుకోవడం కాదు కానీ, మా వాళ్లకు మంచి అనుభవం మాత్రం వచ్చింది. చివరి మ్యాచ్‌లో అన్ని విభాగాల్లోనూ రాణించి విజయం సాధించేందుకు ప్రయత్నిస్తాం" అని సికందర్ రజా తెలిపాడు. మార్చి 1న దక్షిణాఫ్రికాతో జింబాబ్వే తలపడనుంది.

## మస్టర్డ్ లెహంగాలో స్టన్స్ చేసిన శ్రీలీల: పాన్-ఇండియన్ స్టార్ గ్లామరస్ ఫోటోషూట్



## చీరకట్టులో గిలిగింతలు పెడుతున్న మానస వారణాసి.. ఆ స్టైల్ కే ఫిదా గురూ!



సినిమా అనే రంగుల ప్రపంచంలో ముఖానికి రంగు పులుముకొని ప్రేక్షకులను ఆకట్టుకోవాలని ఎంతోమంది పరితపిస్తున్నారు. అందులో భాగంగానే సామాన్యులను మొదలుకొని సెలబ్రిటీల వారసులు కూడా ఇండస్ట్రీలోకి అడుగు పెడుతూ తమ టాలెంటును నిరూపించుకుంటున్నారు. ఇంకొంతమంది సినిమాపై ఇష్టంతో మోడల్స్ గా మారి ఇష్టంతో కష్టమైన పనులను కూడా చేస్తూ ఆఖరికి మిస్ ఇండియా, తెలంగాణ మిస్ వరల్డ్ టైటిల్స్ ను సొంతం చేసుకొని ఆ తర్వాత సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్నారు.అలా మార్గం ఏదైనా సరే ఇండస్ట్రీలోకి రావాలనే కలను నెరవేర్చుకుంటున్నారు. అలాంటి వారిలో మానస వారణాసి కూడా ఒకరు. ఫెమినా మిస్ ఇండియా 2020 అందాల పోటీలో పాల్గొని కిరీటాన్ని అందుకున్న ఈమె.. పలు యాడ్స్ లో కూడా నటించి ఆకట్టుకుంది. ఇక 2020 డిసెంబర్ 20న కోకో కోలా మ్యూజిక్ హాల్లో జరిగిన మిస్ వరల్డ్ పోటీలో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించి పదవ స్థానంలో నిలిచింది. అలాంటి మానస వారణాసి 1997 మార్చి 27న హైదరాబాదులో జన్మించింది.. ఈమె తండ్రి ఉద్యోగం కారణంగా మలేషియాకు వెళ్లిన మానస 2012లో పదవ తరగతి పూర్తి చేసింది.

ఆ తర్వాత హైదరాబాద్ కి వచ్చి.. ఎఫ్ఐఐటి జేఈఈ లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఈమె.. వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి ఫ్యాక్ట్ సెట్ లో ఫైనాన్షియల్ ఇన్ఫర్మేషన్ ఎక్స్చేంజ్ విశ్లేషకురాలిగా కూడా పనిచేసింది. ఇక ఆ తర్వాతే మోడల్ గా మారి పలు అందాల పోటీలలో పాల్గొని తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న ఈమె.. గత ఏడాది దేవకీ నందన వాసుదేవా అనే సినిమా ద్వారా హీరోయిన్గా ఇండస్ట్రీకి పరిచయమైంది. మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇందులో అశోక్ గల్లా హీరోగా నటించారు. ఈ ఏడాది కపుల్ ఫ్రెండ్లీ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో సంతోష్ శోభన్ హీరోగా, మానస వారణాసి హీరోయిన్గా వస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రాన్ని యు వి క్రియేషన్స్ , యు వి కాన్సెప్ట్స్ బ్యానర్లపై అజయ్ కుమార్ రాజు నిర్మిస్తున్నారు. ఇక ఇటీవల ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ నిర్వహించగా అందులో తన అద్భుతమైన లుక్స్ తో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది మానస వారణాసి.ఇకపోతే తాజాగా అవే ఫోటోలను ఆమె ఇన్స్టాగ్రామ్ వేదికగా పంచుకోవడంతో ఆమె అందాన్ని చూసి అభిమానులు మంత్రముగ్ధులవుతున్నారు.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com